విశాలాంధ్ర చిత్తూరు జిల్లా

అమరజీవి చేసిన పోరాటం తెలుగువారందరికీ స్ఫూర్తిదాయకం:ఎమ్మెల్సీ భరత్

విశాలాంధ్ర - కుప్పం : ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఎమ్మెల్సీ భరత్ క్యాంప్ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు చేసిన పోరాటం ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆయన ప్రాణత్యాగం మరువలేనిది అని అన్నారు. అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు ను స్మరించుకుంటూ ప్రజలందరికీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైకాపా నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆశవర్కర్లు క్షేత్ర స్థాయిలో సేవలు అందించాలి:ఎంపిపి

విశాలాంధ్ర - కార్వేటినగరం: ఆశా వర్కర్లు క్షేత్ర స్థాయిలో వైద్య సేవలు అందించాలని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. మంగళవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో ఆషా దే సందర్భగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో వర్కర్ల సేవలు ప్రజలకు ఎంతో అవసరమని తెలిపారు. వైద్య రంగంలో ప్రభుత్వం చేపడుతున్న ప్రతి కార్యక్రమం పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. గర్భిణీలను గుర్తించి వారి వివరాలను నమోదు చేసి వైద్యాధికారుల దృష్టికి తీసుకు రావాలని ఆదేశించారు. అదే విధంగా సీజనల్ వ్యాధుల నివారణకు, షుగర్, బీపీ, ఆస్మ వంటి దీర్ఘ కాలిక వ్యాధులతో బాధపడుతున్న వారి వివరాలను సేకరించి వారికి వైద్య సేవలు అందే విధంగా చూడాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ గోపినాథ్, వైఎస్సార్సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ ధనంజయవర్మ, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పలువురు పాల్గొన్నారు.

ఘనంగా శివ ప్రకాష్ రాజు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర- పాలసముద్రం: రాష్ట్ర వైసిపి సంయుక్త కార్యదర్శి శివ ప్రకాష్ రాజు జన్మదిన వేడుకలు మంగళవారం నాడు వైసీపీ నాయకులు ఎంతో ఘనంగా నిర్వహించారు. ఈయన ఉన్నత చదువులు చదివి బెంగళూరులో స్థిరపడ్డారు. అయినా పుట్టి పెరిగిన ఊరుపై ఉన్న మమకారంతో సొంత ఊరికి ఏదో చేయాలన్న తపనతో తిరిగి సొంత ఊరికి వచ్చి మండలంలో వైఎస్ఆర్సిపి బలోపేతానికి ఎంతగానో కృషి చేశారు. పేద ప్రజలకు అండగా నిలిచి తిరుగులేని నాయకుడిగా ఎదిగి భార్యను ఎంపీపీగా గెలిపించుకొని నిత్యం భార్యాభర్తలు పేద ప్రజల కోసం మండల అభివృద్ధి కోసమే పాటుపడుతున్నారు. నేను ఒక్కడు ఎదిగితే చాలదు చుట్టుప్రక్కల ఉన్న ప్రతి ఒక్క కార్యకర్త ఎదగాలన్న మనస్తత్వం కలిగిన నేతకు పుట్టినరోజు కావడంతో ఉదయాన్నే నాయకులు కార్యకర్తలు ఆయన ఇంటికి చేరుకొని కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు

విశాలాంధ్ర-పులిచెర్ల-కల్లూరు: పులిచెర్ల ఎంపిడిఓ కార్యాలయం, కల్లూరు గ్రామ సచివాలయంలో మంగళవారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాలలో ఎంపీపీ సురేంద్ర నాథ్ రెడ్డి, వైస్ ఎంపీపీ ఈశ్వరి గోవర్ధన్, రాశీ ప్రసాద్, స్వచ్ఛంద కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్ .ఎస్ .రెడ్డి ప్రకాష్ ,ఎంపీడీవో సుగుణమ్మ ,ఎంఈఓ సిద్ధరామయ్య సర్పంచ్ లు రాణి ప్రభాకర్, ఎస్. ఏ షూకూర్, ఎంపీటీసీలు రెడ్డి అహ్మద్, ఈవోపీఆర్డి రాజశేఖర్ బాబు ,ఏపీవో షౌకత్ అలీ, హెచ్ఎం పోకల తాతయ్య, కార్యదర్శి యుగంధర్, రమేష్ బాబు ,వైసిపి నాయకులు నాదముని రెడ్డి, గోవిందరెడ్డి, ఫయాజ్ ,షకీల్ ,ఆరిఫ్, మహేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం

విశాలాంధ్ర -పులిచెర్ల -కల్లూరు: విద్యార్థులకు సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమని ఎంపీపీ సురేంద్ర నాథ్ రెడ్డి అన్నారు. పులిచెర్ల మండలం వెంకట దాసరి పల్లె ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ వ్యవస్థాపకులు మధుసూదన్ సాయి నేతృత్వంలో విద్యార్థులకు అల్పాహారం అందించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ బెల్లం తో తయారు చేసిన రాగి జావా విద్యార్థులు త్రాగడం వల్ల ఐరన్, పొటాషియం, విటమిన్లు, కాల్షియం వంటి పోషకాలు విద్యార్థుల శరీరంలోని ఎముకల పటిష్టత్వానికి దంతాల దృఢత్వానికి, సక్రమ ఎదుగుదలకు రక్తహీనత నుండి పిల్లలను కాపాడి వారి రక్తంలో హిమోగ్లోబిన్ శాతాన్ని పెంపొందించడానికి దోహదపడుతుందని అన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు ఎంపీపీ సురేంద్ర నాథ్ రెడ్డిని, సర్పంచ్ లక్ష్మీ దామోదర్ ను, వైసిపి నాయకులు నాదముని రెడ్డి ని దుశ్శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రాశీ ప్రసాద్ ,సర్పంచ్ లక్ష్మీ దామోదర్, ఎంఈఓ సిద్ధరామయ్య ,హెచ్ ఎం పోకల తాతయ్య,వైసిపి నాయకులు నాదముని రెడ్డి, గోవిందరెడ్డి, ప్రధానోపాధ్యాయులు వెంకట్రామయ్య, ఉపాధ్యాయులు పాల్గుణ మునిరాజు, భాను ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి అభివృద్ధే ధ్యేయంగా పని చేయాలి:ఎంపిపి

విశాలాంధ్ర - కార్వేటినగరం: ఆస్పత్రి అభివృద్ధే ధ్యేయంగా వైద్యులు విధులు నిర్వహించాలని ఎంపీపీ లతబాలాజీ అన్నారు. మంగళవారం వైద్యవిధాన్ పరిష్యత్ కార్యాలయంలో వైద్యాధికారులతో ఎంపీపీ మాట్లాడుతూ రోగులకు అందు బాటులో ఉంటూ వైద్య సేవలు అందించాలని చెప్పారు. ఇప్పటికే కొన్ని విభాగాలకు వైద్యులు అందుబాటులో ఉన్నారని, వారితో పాటు త్వరలో మరికొందరు వైద్యాధికారులు అందుబాటులోకి రానున్నారని పేర్కొన్నారు. వైద్య విధాన పరిష్యతు డిప్యూటీ సీఎం నారాయణస్వామి ఆదేశాల మేరకు త్వరలో అన్ని సౌకర్యాలతో మౌళిక వసతులు కల్పిస్తామని,అలాగే స్టాఫ్ నర్సులు, అదనపు సిబ్బంది,శ్యానిటేషన్ సిబ్బందిని నియమించనున్నట్లు తెలిపారు. ఆస్పత్రి ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తామని, అత్యవసర నిమిత్తం ఆస్పత్రికి ఇన్వెటర్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. విధులు నిర్వహించే వైద్యాధికారుల వివరాలను డ్యాష్ బోర్డులో విధిగా ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ సమయ పాలన పాటించి రోగులకు మెరుగైన వైద్యం అందించి ప్రభుత్వానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ధనంజయవర్మ, వైద్యాధికారులు డాక్టర్ గోపినాథ్, డాక్టర్ లక్ష్మీపతి, డాక్టర్ భాగ్యలక్ష్మి, డాక్టర్ మురళీకృష్ణ, డాక్టర్ కీర్తి, డాక్టర్ శ్రుతిభాగ్యం. డాక్టర్ టీఆర్ పాండియన్, డాక్టర్ మీనాక్షి,డాక్టర్ లావణ్య, డాక్టర్ మహేష్ బాబు,పలువురు పాల్గొన్నారు.

తోట కనుమ కృష్ణమూర్తి మృతికి మాజీ మంత్రి సంతాపం

విశాలాంధ్ర -పలమనేరు : పలమనేరు నియోజకవర్గ పరిధిలోని వీకోటమండలంలోని తోటకనమ గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తోట కనుమ కృష్ణమూర్తి అకాలమృతి పట్ల సంతాపాన్ని తెలియజేసి వారి కుటుంబీకులను పరామర్శించిన మాజీ మంత్రి ఎన్ అమర్నాథరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా పొట్టి శ్రీరాములు జయంతి

విశాలాంధ్ర - రామకుప్పం: అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని ఆంధ్ర రాష్ట్రం అవతరణ దినోత్సవాన్ని మండల అభివృద్ధి అధికారి కార్యాలయం లో మంగళవారం వైసీపీ నాయకులు మరియు ప్రభుత్వ అధికారులు ఘనంగా జరుపుకున్నారు ఈ సందర్భంగా మండల వైసీపీ అధ్యక్షుడు బాబురెడ్డి కో కన్వీనర్ చంద్రారెడ్డి జెడ్పీటీసీ నితిన్ ఎంపీపీ సుబ్రహ్మణ్యం లు మాట్లాడుతూ ఆనాడు మద్రాసు రాష్ట్రం నుండి ఆంధ్ర రాష్ట్రం సాధన కోసం నిరాహార దీక్షకు పూనుకుని ప్రాణత్యాగానికి సైతం వెనుకాడలేదని ఆయన ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తి గా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి కార్యాలయ సిబ్బంది మరియు తహసీల్దార్ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జగన్ మామయ్యా..పరీక్షలు వచ్చేశాయ్

- నేటి నుంచి సిబిఏ,ఎఫ్ఏ వన్ పరీక్షలు - విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందని పాఠ్యపుస్తకాలు- ఆవేదనలో విద్యార్థులు, తల్లిదండ్రులు



విశాలాంధ్ర-వెదురుకుప్పం: విద్యార్థులకు పాఠశాలలు ప్రారంభించి నెలలు గడుస్తున్నా సకాలంలో అందించాల్సిన పాఠ్యపుస్తకాలు మొదటి సెమిస్టర్ పరీక్షలు షెడ్యూలు ఖరారై నేటి నుంచి పరీక్షలు నిర్వహిస్తున్న క్రమంలో ఇప్పటివరకు పాఠ్య పుస్తకాలు ప్రభుత్వ ,ప్రైవేటు పాఠశాలలో విద్యార్థులకు పూర్తిగా స్థాయిలో ఇవ్వకపోవడంపై ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నుద్దేశించి" జగన్ మామయ్యా పరీక్షలు వచ్చేశాయ్" పాఠ్యపుస్తకాలెక్కడ అని ఆవేదన వ్యక్తంచేస్తున్న పరిస్థితి.ఇదంతా ఎవరి తప్పిదం,అధికారుల నిర్లక్ష్యమా.. ప్రభుత్వ అలసత్వమా తెలియదు కానీ విద్యార్థులు,తల్లిదండ్రులు అంతర్మథనంలో పడ్డారు. అసలేం జరిగిందంటే.. చిత్తూరు జిల్లాలో ప్రాథమిక,ప్రాథమికోన్నత, జడ్పీ హైస్కూళ్లో ,మొత్తం 2483 ప్రభుత్వ స్కూళ్లలో 17082 మంది విద్యార్థులు చదువుతున్నారు.అదేవిధంగా ప్రైవేటు 418 పాఠశాలల్లో 73765 మంది విద్యార్థులు చదువుతున్నారు.కాగా మొత్తం జిల్లాలో 2901 ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలల్లో 244747 మంది విద్యార్థులు చదువుతున్నారు. అయితే నవంబర్ 2 అనగా నేటి నుంచి ఒకటవ తరగతి నుంచి 8వ తరగతి వరకు క్లాస్ రూమ్ బేస్డ్ అసైన్మెంట్ పరీక్షలు మరియు ఫార్మేటివ్ అసైన్మెంట్ వన్ పరీక్షలు నిర్వహణకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఇంతవరకు బాగానే ఉన్నా ప్రభుత్వ పాఠశాలల్లో పూర్తి స్థాయిలో ఇంకా పాఠ్యపుస్తకాలు అందలేదని చెబుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలకు సుమారు 50 శాతం వరకు ఎంతవరకు పాఠ్య పుస్తకాలు అందించ లేదని ప్రైవేట్ యాజమాన్యాలు,విద్యార్థులు,విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పరీక్షలు పూర్తి అవగాహనతో ఎలా రాయాలని విద్యార్థులు ప్రశ్నిస్తున్నారు.పాఠ్య పుస్తకాలు పూర్తిస్థాయిలో ఇప్పటివరకు అందించక పోగా రెండు,మూడు సెమిస్టర్ లకు నవంబర్ 10 తేదిలోగా పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో అందించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం కొసమెరుపు.అంటే మొదటి సెమిస్టర్ కే పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు అందించని క్రమంలో మరో 10 రోజుల్లో ఏడాది తరగతుల పూర్తి పాఠ్యపుస్తకాలు అందించగలరా అని విద్యాశాఖ అధికారుల్లో చర్చలు సాగుతున్న పరిస్థితి నెలకొంది. ఏది ఏమైనా పాఠ్యపుస్తకాలు పంపిణీ పూర్తిస్థాయిలో అందని వైనం రెండు,మూడు సెమిస్టర్‌ల కైనా సకాలంలో అందించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే విషయమై పాఠ్యపుస్తకాల పంపిణి మేనేజర్ రమేష్ వివరణ కోరగా మొదటి విడత ఇండెంట్ ప్రకారం పూర్తిగా పాఠ్యపుస్తకాల పంపిణీ జరిగింది.అదనంగా చివరి దశలో కొన్ని ఇండెంట్ లు వచ్చినవి అతి కొద్ది పాటి కొరత ఉండొచ్చు.చిత్తూరు,తిరుపతి జిల్లాలో ప్రయివేటు పాఠశాలల్లో కొంత పాఠ్య పుస్తకాలు అందించాల్సి ఉన్న మాట వాస్తవమే అన్నారు.ఇదే విషయమై చిత్తూర్ జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం వివరణ కోరగా విద్యార్థుల పాఠ్యపుస్తకాలు పూర్తిస్థాయిలో అందని విషయమై పరిశీలించి సమాచారం తర్వాత చెప్తానని చెప్పారు,ఆ తర్వాత అందుబాటులోకి రాలేదు.

రోడ్ల వైపు గ్రానైట్ వ్యర్థాలు వేయరాదు : కలెక్టర్

విశాలాంధ్ర - చిత్తూరు: జిల్లాలోని పలు ప్రాంతాలలో గ్రానైట్ ఫ్యాక్టరీలకు సంబంధించిన వ్యర్థాలు వేయడం వలన రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు తీవ్రత పెరిగి ప్రాణాలకు ముప్పు రావడం జరుగుతోందని వ్యర్థాలు రోడ్లు వైపు వేయకుండా గ్రానైట్ ఫ్యాక్టరీ యజమానులకు అవగాహన కల్పించి తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం. హరి నారాయణన్ అన్నారు. జిల్లా కలెక్టర్ మంగళవారం జిల్లా పరిశ్రమల అధికారులు, మైన్స్ అధికారులు, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ చిత్తూరు లో పలు గ్రానైట్ ఫ్యాక్టరీలకు సంబంధిం చిన వ్యర్థాలు రోడ్ల వైపు డంప్ చేయడం జరుగు తోంద న్నారు. స్థలం అవసరమైతే ఆపివేసిన గ్రానైట్ క్వారీలలో వ్యర్థాలను వేసేందుకు అను మతులు ఇవ్వడం జరుగుతుందని కలెక్టర్ అన్నారు. రోడ్డు ప్రమాదంలో ప్రమాద తీవ్రత వల్ల దీనిని ఫ్యాక్టరీ యజ మానులు కూడా గుర్తించి వ్యర్థాలను రోడ్డుపై వేయకుండా కేటాయించబడిన స్థలంలోనే వేయాలన్నారు. దీనికి సంబంధించి పది రోజులలో ప్రణాళికను సిద్ధం చేయాలని కలెక్టర్ అధికారులతో అన్నారు. ఈ కార్యక్ర మంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జిఎం రామకృష్ణ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారి నరేంద్రబాబు, మైనింగ్ అధికారులు ప్రసాద్, ప్రకాష్, పోలి రెడ్డిలు పాల్గొన్నారు.

నైట్ డ్యూటీలో వైద్యులు అందుబాటులో ఉండాలి: డీసీహెచ్ఎస్

విశాలాంధ్ర - కార్వేటినగరం: నూతనంగా ఏర్పాటు చేసిన కామన్ హెల్త్ సెంటర్(సీహెచ్సీ) లో వైద్యులు రాత్రి వేళల్లో కూడా అందుబాటులో ఉండాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ బీసీకే నాయక్ అన్నారు. మంగళ వారం సీహెచ్సీని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధులకు హాజరై వైద్యాధికారులు సమయ పాలన తప్పక పాటించాలని ఆదేశించారు. అదే విధంగా నైట్ డ్యూటీకి హాజరు అయ్యే వైద్యులు కూడా సమయానికి అందుబాటులో ఉంటూ రోగులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. అనంతరం సీహెచ్సీకి సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అలాగే బయోమెట్రిక్ విధానాన్ని పరిశీలించారు. అదే విధంగా మందుల నిల్వలను పరిశీలించి ప్రతి వ్యాక్సిన్ అందుబాటులో ఉండేలా చూడాలను, వైద్య సిబ్బందికి డ్రస్ కోడ్ తప్పని సరిని ఆదేశించారు. అలాగే ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పులు జరిగేలా చూడాలని, కాన్పుల సంఖ్యను పెంచాలని పేర్కొన్నారు. ఆయన వెంట సీనియర్ మెడికల్ అధికారి డాక్టర్ లక్ష్మీపతి, డాక్టర్ గోపీనాథ్,మురళీకృష్ణ పలువురు ఉన్నారు.

ఎమ్మెల్యేకు క్వారీకీ సంబంధం లేదు

జనార్దన్ నాయుడువి అసత్య ఆరోపణలు

విశాలాంధ్ర - వి.కోట : గత 6 నెలలుగా సామాజిక మాధ్యమాల్లో పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ పై ఓ క్వారీ విషయం గా జరుగుతున్న అసత్య ప్రచారాలపై స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి. ఎన్. నాగరాజు, మొగసాల కృష్ణమూర్తి లు ఘాటుగా స్పందించారు. కర్నాటక రాష్ట్రం కేజీఎఫ్ కు చెందిన జనార్దన్ నాయుడు అనే వ్యక్తి పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ తన నుండి క్వారీ లాక్కున్నారని తనకు డబ్బులు ఇవ్వకుండా మోసం చేశారని. ముప్పై ఐదు లక్షల కు చెల్లని చెక్కు ఇవ్వడంతో కర్నాటక రాష్ట్రం కేజీఎఫ్ కోర్టుకు ఇటీవల ఎమ్మెల్యేను రప్పించడంపై స్పందించిన రాష్ట్ర కార్యదర్శులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసలు వెంకటేశ్వర క్రషర్ కు ఎమ్మెల్యే వెంకటేగౌడ సంబంధం ఏంటని ప్రశ్నించారు. పలమనేరు ప్రాంతానికి చెందిన మోహన్ బాబుకు చెందిన క్రషర్ ను ఆయన బయటి దేశాలకు వెళ్లాల్సి రావడంతో కేజీఎఫ్‌కు చెందిన జనార్దన్ నాయుడు, వి. కోట ప్రాంతానికిచెందిన సుధాకర్ రెడ్డి లకు అమ్మకాలు జరిపి వ్యాపారం చేసుకునే వారని సుధాకర్ రెడ్డి, జనార్దన్ నాయుడుల పార్టనర్ షిప్ వ్యాపారంలో లెక్కల్లో తేడాలు రావడంతో వి. కోటకు చెందిన సెంధిల్ అనే వ్యక్తి కి వెంకటేశ్వర క్రషర్ ను అమ్ముకున్నారని తెలిపారు. అనంతరం ఈ మధ్య కాలంలో సెంధిల్ సైతం క్వారీ నడపలేక వి. కోట మండలం కుంభార్లపల్లి గ్రామానికి చెందిన శరత్ అనే వ్యక్తికి క్రషర్‌ను అమ్మివేయడంతో ప్రస్తుతం శరత్ ఆ క్వారీని నడుపుతున్నారన్నారు. ఇదే విషయాన్ని జనార్దన్ నాయుడుతో కలసి క్వారీని కొన్న సుధాకర్ రెడ్డి సైతం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పై విషయాన్ని తెలుపుతూ ఎమ్మెల్యేకు క్వారీలో ఎలాంటి సంబంధం లేదని అమ్మకాలు కొనకాల్లో ఆయన ప్రమేయమే లేదన్నారు. కాగా వెంకటేగౌడ ఎమ్మెల్యే కాక మునుపే స్వతహాగా బెంగళూరులో బిల్డర్‌గా ఎదిగిన మనిషిని జనార్దన్ నాయుడుకు మెటీరియల్ కోసం అడ్వాన్స్ చెక్కును ఇచ్చారని సరైన సమయానికి సదరు వెంకటేశ్వర క్రషర్స్ నుండి మెటీరియల్ రాని కారణంగాచెక్కు చెల్లుబాటు కాలేదని పేర్కొన్న రాష్ట్ర కార్యదర్శులు ప్రస్తుతం రాష్ట్రంలో వైకాపా అభివృద్ధి ని జీర్ణించుకోలేని పలమనేరు మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి అమర్నాథరెడ్డి ప్రస్తుత ఎమ్మెల్యే వెంకటేగౌడపై కక్ష సాధింపు కోసం జనార్దన్ నాయుడు తో అసత్య ఆరోపణలు చేయిస్తూ కేవలం రాజకీయ లబ్ధి కోసం ఎమ్మెల్యే వెంకటే గౌడను అవమాన పరచాలని ప్రజల్లో చులకన చేయాలన్న కుట్రలో భాగంగా ఆడుతున్న నాటకమని అన్నారు. అయితే అనవసరంగా ఎమ్మె ల్యే ను అవమానిస్తున్న జనార్దన్ నాయుడుపై వి.కోట పోలీసుస్టేషన్ లో ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

వానలోనూ ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్

విశాలాంధ్ర -ఎస్ఆర్ పురం: ప్రతి గడపగడపకు రోగులకు మెరుగైన ప్రభుత్వ వైద్యం అందించాలని ఉన్నత లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ విధానం తీసుకువచ్చిందని జిల్లా ఇమ్యూనిజేషన్ అధికారి రవిరాజు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరంగరాజపురం మండలం కటికపల్లి సచివాలయ పరిధిలో గల గ్రామాల్లో డోర్ టు డోర్ సర్వే నిర్వహించి రోగులను గుర్తించారు. మండల వైద్యశాల కేంద్రంలో ఏఎన్ఎం ,ఆశా వర్కర్స్‌కు టిబి రోగులను ఏ విధంగా గుర్తించాలి, రోగి పట్ల తీసుకోవల సిన జాగ్రత్తలుఅవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి మండల వైద్యాధికారి డాక్టర్ బాలసుబ్రమణ్యం రెడ్డి, డాక్టర్ పల్లవి, స్థానిక సర్పంచ్ మార్ కొండయ్య, హరిత,104 మెడికల్ ఆఫీసర్ గౌస్, స్టాఫ్ నర్స్ యామిని, ఆశా వర్కర్, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి దారుణ హత్య

విశాలాంధ్ర-పెద్దపంజాణీ: మండలం లోని ఇటుక నెల్లూరు సమీపంలో యువకుడు దారుణ హత్యకు గురైన సంఘటన జరిగింది. పుంగనూరు మండలం బతలాపురం గ్రామానికి చెందిన రెడ్డప్ప కుమారుడు దామోదరం (27)సంగత ఏడాది పెద్దపంజాణీ మండలంలోని పెను గొలకల గ్రామానికి చెందిన చంద్రమో హన్ కుమార్తె అనురాధ(20)వివాహం జరి గింది. అయితే ఈ దీపావళి పండుగకు దామోదరం అనురాధ ఇద్దరు కలిసి అత్తారింటికి దీపావళి నోములు పండక్కి వెళ్లారు. సోమ వారం పెనుగోలకల గ్రామం నుండి నోముల పండుగ కార్యక్రమం ముగించుకుని తిరిగి దామోదరం స్వగ్రామమైన బతలాపురంకు సాయంత్రం 6:30 గంటల సమయంలో ద్విచక్ర వాహనంపై వస్తుండగా మార్గమధ్యంలోని ఇటుక నెల్లూరు సమీపాన దొన బావి దగ్గర వస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు దంపతులపై కారం పొడిచల్లి దామోదరంను గొడవలతో విచక్షణా రహితంగా నరికి కత్తులతో పొడిచి హతమార్చారు. దామోదరం అక్కడక్కడ మృతి చెందాడు భార్య అనురాధకు స్వల్ప గాయాలయ్యాయి. అటుగా వెళుతున్న ద్విచక్ర వాహనదారులు దామోదరం కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా కుటుంబ సభ్యులు వచ్చి చూసేసరికి దామోదర మృతి చెందాడు. వెంటనే పెద్దపంజాణీ పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు సంఘటనా స్థలానికి చేరుకుని హత్యా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. అనంతరం దామోదరం కుటుంబ సభ్యులు కోడలిపై అనుమానం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.పోలీసులు లోతుగా విచారణ జరిపిమృతుని కుటుంబ సభ్యులకు న్యాయం చేస్తామని తెలిపారు.

పాల ఉత్పత్తిని మెరుగుపర్చటం ద్వారానే పాడి పరిశ్రమ అభివృద్ధి

- ఉపకులపతి ఆచార్య పద్మనాభ రెడ్డి

విశాలాంధ్ర - తిరుపతి ఎస్వీయూ: దేశంలో పశువుల పాల ఉత్పత్తిని మెరుగుపర్చటం ద్వారానే పాడి పరిశ్రమను అభివృద్ధి బాటలో నడిపించగలమని శ్రీవెంకటేశ్వర పశు విశ్వ విద్యాలయం ఉపకులపతి ఆచార్య వి. పద్మనాభ రెడ్డి ఆకాంక్షించారు. ఈ మేరకు వర్శిటీలో పాడి పరిశ్రమ ప్రగతి దిశగా పశుపోషణలో నవీన పద్ధతులపై నాలుగు రోజుల పాటు జరిగే అవగాహనా సదస్సును మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య పద్మనాభ రెడ్డి మాట్లాడుతూ పశు పోషణలో అధునాతన మెళకువలు, తక్కువ ఖర్చుతో నాణ్యమైన, ఆరోగ్యకరమైన సమతుల్య పోషణపై అవగాహనను అందించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రవాస భారతీయుడైన పశువైద్య పూర్వ విద్యార్థి, అమెరికా దేశంలో న్యూ టెక్ బయో సైన్సెస్ పరిశ్రమ అధిపతి డాక్టర్ ప్రతాప్ రెడ్డి అనిమల్ న్యూట్రిషన్ డిపార్ట్మెంట్ బిల్డింగ్, భారతదేశంలోనే ప్రప్రథమంగా పశు ఉత్పాదకత పెంపొందించే దిశగా పశువులకు అందించే పచ్చ గడ్డి దాణా, ఇతర మేతల నాణ్యత, పశు పోషక విలువలను పరీక్షించి సత్వర ఫలితాలను అందించే ప్రయోగశాలను నెలకొల్పారని, అందుకు సంబంధించిన అధునాతన యంత్రపరికరాలను విదేశాల నుంచి స్వచ్ఛందంగా సమకూర్చారని కొని యాడారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ అరుణాచలం రవి, డాక్టర్ ప్రతాప్ వి. రెడ్డి, వర్శిటీ డీన్ డాక్టర్ బ్రాహ్మయ్య, పరి శోధనా విభాగపు డీన్ డాక్టర్ సర్జన్ రావు, అసోసియేట్ డీన్ డాక్టర్ అదిలక్ష్మమ్మ, అనిమల్ న్యూట్రీషన్ విభాగాధిపతి డాక్టర్ దేవసేన, ఎల్ఎఫ్సి విభాగాధిపతి డాక్టర్ సూర్యనారాయణ, డాక్టర్ డి.విరెడ్డి , డాక్టర్ పార్థసారథి పాల్గొన్నారు.

బంగారమ్మకు ప్రత్యేక అభిషేకాలు పూజలు

విశాలాంధ్ర -కార్వేటినగరం : గ్రామ దేవత బంగారమ్మకు మంగళవారం ఉదయం ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలతో అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వివిధ గ్రామాల నుండి భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు ప్రసాద్ ఉపాధ్యక్షులు రంగనాథ మొదలి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అల్పాహారం

విశాలాంధ్ర- పులిచెర్ల - కల్లూరు: పులిచెర్ల మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ వ్యవస్థాపకులు సద్గురు మధుసూదన్ సాయి నేతృత్వంలో విద్యార్థులకు ఉదయం అల్పాహార పథకాన్ని అందించనున్నారు. మండలంలో ఈ పథకాన్ని మంగళవారం పులిచెర్ల, కల్లూరు, మతుకువారిపల్లె, దిగువ పోగలవారిపల్లె ప్రభుత్వ పాఠశాలలో సర్పంచులు రాణి ప్రభాకర్, ఎస్. ఏ షూకూర్, గిరిధర్ రెడ్డి, పోకల ఉమాదేవి గంగయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచులు మాట్లాడుతూ విద్యార్థులకు సత్యసాయి ట్రస్ట్ సేవలు ప్రశంసనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు పోకల చంద్ర, రెడ్డి అహ్మద్, పేరెంట్స్ కమిటీ చైర్మన్ లు మహమ్మద్ రఫీ, రేష్మ,మాజీ ఎంపిటిసి శ్రీనివాసులు, హెచ్ఎంలు సూర్యనారాయణ, పోకల తాతయ్య, కామేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టబద్రుల ఓటర్ల నమోదులో టిడిపి

విశాలాంధ్ర -కార్వేటినగరం : పట్టబద్రుల ఓటరు నమోదు కార్యక్రమం టిడిపి జీడీ నెల్లూరు నియోజకవర్గ బీసి సెల్ అధ్యక్షులు రవి యాదవ్ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. మంగళవారం వారు మాట్లాడుతూ హక్కుల కోసం పోరాడే సమర్ధవంతమైన మంచి అధినాయకుడిని మనం ఎన్నుకోగలిగితే ప్రజల పక్షాన పోరాడే హక్కు మనకు కలుగుతుందన్నారు. పట్టుబద్రుల ఓటు వేసే రోజున ఒకసారి ఆలోచన చేసి నిజాయితీ కలిగిన పోరాట సమరయోధుడిని ఎన్నుకోవాలని కోరుతూ వారందరికీ గ్రామంలో దిశ నిర్దేశించడం జరిగిందన్నారు. చదువుకున్న వారు కాబట్టి ఎక్కువ చెప్పకుండా ఆలోచన చేసి ఓటు వేస్తారని, టిడిపి అభ్యర్థి ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సందీప్, మైనార్టీ సెల్ చిత్తూర్ పార్లమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ కె. సందని, తదితరులు పాల్గొన్నారు.

నిరూపయోగంగా వస్తువులు బహిరంగ వేలం

విశాలాంధ్ర - బైరెడ్డిపల్లె, : కమ్మనపల్లి బాలికల గురుకుల పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న వస్తువులన్నిటినీ నవంబరు 5 వ తేదీన అనగా శనివారం ఉదయం 10 గం లకు బహిరంగ వేలం వేయటం జరుగుతుందని ప్రిన్సిపల్ ఇ. వి శోభ తెలిపారు. ఈ వస్తువులు పాత ఇనుప మంచాలు, పాత వంట పాత్రలు, పాత చెక్క వస్తువులు, ప్లాస్టిక్ సామాను మరియు ఇతరత్రా ఉంటాయని ఒక ప్రకటనలో తెలియచేసారు. ఆసక్తి ఉన్నవారు వస్తువుల కొనుగోలు ధరలో 2 శాతం దరావతు చెల్లించి వేలంలో పాల్గొనాలని ప్రిన్సిపల్ తెలిపారు.

ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవం వేడుకలు

విశాలాంధ్ర - బైరెడ్డిపల్లి : మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయంలో మంగళవారం కుమారస్వామి తన సిబ్బందితో కలసి ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగాపొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహ సిల్దార్ కుమారస్వామి విఆర్వోల యూనియన్ నాయకులు గురువి రెడ్డి,వెంకటేష్, రాజేష్ మరియు వీఆర్ఏలు రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దళితుల శ్మశానానికి దారేది

విశాలాంధ్ర - వి.కోట: మండలంలోని పత్రపల్లి కొత్తూరులో దళితులు మృతిచెందితే శ్మశానానికి దారిలేక చెరువు నీటిలో నానా అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొంది. సోమవారం పి.కొత్తూరు గ్రామానికి చెందిన నారాయణప్ప కుమారుడు రమేష్ (55) అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామానికి సమీపంలోని చెరువును దాటుకుని స్మశానానికి వెళ్ళాల్సి వచ్చింది. . ఇటీవల వానలకు చెరువు పూర్తిగా నిండి మ్మొరవ ప్రవహిస్తోంది. దీంతో స్మశానానికి దారి లేక చెరువులో ప్రాణాలకు తెగించి నడుముల లోతు నీటిలో శవాన్ని మోసుకు వెళ్ళాల్సిన పరిస్థితి నెలకొంది. స్వాతంత్ర్యం వచ్చి డెబై ఐదేళ్ళ పూర్తి కావస్తున్నా దళితుల స్మశానాలకు దారి వసతులు లేకపోవడానికి ఈ ఘటన నిదర్శనంగా నిలుస్తోంది.

అక్రమ బదిలీలు రద్దు చేయాలి:ఏపీటీఎఫ్

విశాలాంధ్ర-పలమనేరు : కౌన్సిలింగ్ విధానానికి తూట్లు పొడుస్తూ ప్రభుత్వం దొడ్డిదారిన కల్పిస్తున్న బదిలీలను రద్దు చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పాండురంగ వర ప్రసాదరావు డిమాండ్ చేశారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఆరు మాసాలుగా అదిగో ఇదిగో బదిలీలుఅంటూ ఊరిస్తూ బదిలీల షెడ్యూలు ప్రకటించకుండా దొడ్డి దారిన బదిలీలు చేయడంసరికాదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ పత్రికా సంపాదకులు పి తులసీనాథంనాయుడు,గురుమూర్తి, సుదర్శనచారి,బాలసుబ్రమణ్యం,ఏసు రత్నం, చిరంజీవి పాల్గొన్నారు.

SRI BOYAKONDA CANGAMMA DEVASTHANAM

Diguvapalli Village, Chowdepalli Mandal, Chittoor District

Lr in Rc.No: E/245/2022 Dt: 01.11.2022

E-PROCUREMENT TENDER NOTICE

Sl. No	Name of the Work	Estt., amount (In Lakhs)
1	Providing & Improvements to extra "Q" lines and amenities to Q-Line shelters in the premises of temple.	31.00
2	Improvements to office building.	17.80
3	Construction of Peddabhogam & Chinna Bhogam Mandapam in the premises of Temple.	32.50
4	Construction of Mukhadwaram at Valasapalli	17.00
5	Construction of Mukhadwaram near shopping Complex at downhill.	28.52

This bids can downloaded on AP e-procurement portal from 02-11-2022 on 12-30 PM to 16-11-2022 up to 12-30 PM, Last date for submission of bid on 16-11-2022 at 1-00 PM, PQ/Technical bid opening on Commercial / Price bid opening on 16-11-2022 at 1-30 PM. Please refer or www.apeprocurement.gov.in for details. For further clarification contact Executive Officer, Sri Boyakonda Gangamma Devasthanam, +919491000741.

Sd/- **Middinti Sankara Narayana** Chairman & Board of Trustees

Sd/- **B. Chandra Mouli** Executive Officer

వర్షంతో ఇబ్బందులుంటే హెల్ప్ లైన్‌కు తెలియజేయండి

- కమిషనర్ అనుపమ అంజలి

విశాలాంధ్ర - తిరుపతి : తిరుపతి మునిసిపల్ పరిధిలోని ప్రజలు ప్రస్తుతం పడుతున్న వర్షాల వలన ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నా వెంటనే తమ హెల్ప్ లైన్ నంబర్ 08772256766 కు ఫోన్ చేయాలని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి మంగళవారం ఓక ప్రకటనలో తెలిపారు. అధిక వర్షాలు కారణంగ లోతట్టు ప్రాంతాల్లోని పెద్ద కాలువలు వద్ద పర్యవేక్షణ చేస్తున్నామని, ఒకవేళ ఎక్కడన్నా కాలువల నిర్వహణపై సందేహం వుంటె తమకు తెలియజేయాలన్నారు. వర్షంలో ఎలాంటి సహాయం కావాలన్నా తమ సిబ్బంది నిరంతరం అందుబాటులో వుంటారని కమిషనర్ అనుపమ అంజలి తెలిపారు.

పేటలో ఘనంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం

విశాలాంధ్ర- సూళ్లూరుపేట : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా ఇవాళ కచ్చేరివీధిలో శ్రీ పొట్టి శ్రీరాములు విగ్రహానికి నెల్లూరు రూరల్ ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షులు కాకి శ్రీ రామ మూర్తి మరియు సూళ్లూరుపేట మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు కాళంగి పవన్ కుమార్ ఆధ్వర్యంలో శ్రీ పొట్టి శ్రీ రాములు గారికి ఘనంగా నివా ళులు అర్పించడం జరిగింది.వరణుడు జోరు వాన తో శ్రీ పొట్టి శ్రీ రాము లు విగ్రహాన్ని అభిషేకించగా సూళ్లూరుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ చిన్ని సత్యనారాయణ మరియు మండల ఆర్యవైశ్య అధ్యక్షులు కాళంగి పవన్ కుమార్ పూల మాల వేసి నివాళులు అర్పించారు.జోరు వాన సైతం లెక్క చేయకుండా ఆ మహనీయునికి నివాళులు అర్పించినదానికి వచ్చిన ఆర్యవైశ్యులు.మండల ఆర్యవైశ్య సంఘం గౌరవ సలహా దారులు అయితా శ్రీధర్ , అలవల సురేష్ ,అలవల శ్రీను,సెక్రటరీ దుర్గి రమేష్ , కోశాధికారి శ్రీరామ్ సుబ్రహ్మణ్యం , వైస్ ప్రెసిడెంట్స్ కోట నాగేశ్వరావు , జాలది చంద్రశేఖర్ ,జాయింట్ సెక్రటరీ పైడిమర్రి కిషోర్ , మరియు పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులు ఒలేటి సుబ్రహ్మణ్యం ,మద్దూరి భాస్కర్ , ఆలపాటి బాలాజీ , ఆలపాటిప్రసాద్,కిషోర్ , కుప్పం సుబ్బారావు , భగవన్ దాస్ మరియు పట్టణ పురప్రముఖులు పాల్గొని శ్రీపొట్టి శ్రీ రాములుకి జోహార్లు తెలిపారు.

ఆర్డీఓ బాధ్యతల స్వీకరణ కిరణ్ కుమార్

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు నూతన ఆర్డీఓగా కిరణ్ కుమార్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆర్డీఓగా విధులు నిర్వహిస్తున్న మురళీకృష్ణ బదిలీ అయ్యారు. దీంతో గతంలో ఐఏఎస్ అధికారిని శోభిక ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఆమె గూడూరులో బాధ్యతలు చేపట్టక నెల్లూరు జిల్లాలో నూతనంగా కలిసిన కందుకూరు సబ్ కలెక్టర్ గా బాధ్యతలు తీసుకున్నారు. దీంతో చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఓఎస్డీగా ఉన్న కిరణ్ కుమార్ ను గూడూరు ఆర్డీఓగా నియమిస్తూ ఉత్తర్వు లు పదిరోజుల క్రితం వెలువడ్డాయి. మంగళ వారం ఆయన గూడూరు లోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

యశ్వంత్ ఆచూకీ త్వరలోనే కనుక్కుంటాం : సీఐ

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణంలోని ఓ ప్రయివేటు స్కూల్ లో పదవ తరగతి చదువుతున్న విద్యార్థి యశ్వంత్ పదిహేను రోజుల క్రితం అదృశ్యమయ్యాడు. విద్యార్థి తల్లిదండ్రులు ఒకటవ పట్టణంలో ఫిర్యాదుచేశారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో సోమవారం స్కూల్ యాజమాన్యాన్ని నిలదీశారు. ఏ రోజైతే స్కూల్‌కు రాలేదో అదే రోజు ఫోన్ చేసి సమా చారం ఇచ్చామని, ఉపాధ్యాయులు కానీ, విద్యార్థులు కానీ యశ్వంత్ ను ఏమీ అనలేదని, అతని జాడ తమకూ తెలియదని చెప్పారు. ఈ విషయమై స్పందించిన సీఐ మంగళవారం పోలీస్ స్టేషన్ లో మీడియా సమావేశం నిర్వహించారు. యశ్వంత్ కోసం రెండు బృందాలు గాలిస్తున్నాయన్నారు. చెన్నై సీసీ ఫుటేజీలలో యశ్వంత్ కనిపించాడన్నారు. త్వరలోనే యశ్వంత్ ఎక్కడున్నాడో ఛేదిస్తామన్నారు.

ముందు జాగ్రత్త చర్యలు.. దోమలపై దండయాత్ర

పాత పరిస్థితులు పునరావృతం కాకుడదని ముందస్తు చర్యలు
స్వయాన సర్పంచ్ కుటుంబ సభ్యులతో కలసి రాత్రి వేళల్లో ఫాగింగ్

విశాలాంధ్ర - దొరవారిసత్రం : దొరవారిసత్రం మండల పరిధిలోని యేకొ ల్లు గ్రామంలో గత పది సంవత్స రా లుగా ప్రతి యేడాది తీవ్రమైన డెంగ్యూ జ్వరాలు రావడం సర్వసాధారణంగా ఉంది. అయితే 2018 సంవ త్సరంలో అయితే గ్రామం మొత్తం ఈ డెం గ్యూ బారిన పడింది. షుమారు 120మందికి పైగా ఈ వ్యాధి బారిన పడ్డారు. పదిమందికి పైగా చావు అంచులవరకు వెళ్లివచ్చారు. వైద్యులు, అప్పటి పాలకులు కూడా పట్టించు కోకపోవడంతో లిగ్రామ ప్రజలు మూ ఢనమ్మకాలపై ఆధారపడి.. గ్రామంలో జంతు భలులు, గ్రామ కట్టుబా ట్లు, అమ్మవారి పొంగళ్ళు, నైవేద్యాలు చేసుకోవలసి వస్తుందని పలువురు అంటున్నారు.అయితే ప్రస్తుత సర్పంచ్ ఆవులు భ్లేస్సి ఓ అడుగు ముం దుకు వేసి ప్రతి యేడాది లాగ ఈ యేడాది కూడా ప్రజలు ఇబ్బందులు పడకూడదనే తలంపుతో ముందస్తు జాగ్రత్తగా గ్రామంలో చెత్త తొలగింపు, వీధులు పరిశుభ్రంగా ఉంచడం, బ్లీచింగ్ చేస్తున్నారు రాత్రి వేళల్లో ఫాగింగ్ చేయడం, ప్రతి ఇంటికి గ్రీన్ అంబాసిడర్లు వెళ్లి డెంగ్యూ దోమల మందు చల్లడం వంటి కార్యక్రమాలు చేపట్టడం జరిగింది.దీంతో మహిళ సర్పంచ్ ఆవులభ్లేస్సికు గ్రామస్తుల అండ కూడా తోడవడంతో స్వచ్ఛ ందంగా యువత ముందుకు వచ్చి ఆమె చేసే పనుల్లో పాలుపం చుకుంటున్నారు.

గూడూరులో జోరు వర్షం

భయాందోళనలో పట్టణ ప్రజలు

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు పట్టణంలో మంగళవారం వేకువ జాము నుండి జోరు వర్షం కురుస్తోంది. ఈ వర్షంతో రోడ్లు జలమయమయ్యాయి. వాతావరణ శాఖ అధికారులు వర్షం మరో నాలుగైదు రోజులు ఉంటుందని ప్రకటించారు. దీంతో పట్టణ శివారు, లోతట్టు ప్రాంతాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. 2015 నవంబర్ నెలలో భారీ వరదలతో గూడూరు పట్టణ శివారు ప్రాంతాలు నీటి మునిగి అపార ఆస్తి నష్టం సంభవించింది. గూడూరుతోపాటు వెంకటగిరి, బాలాయపల్లి, డక్కిలి, సైదాపురం మండలాలలో భారీ వర్షాలు పడితే మళ్లీ 2015 దుస్థితి ఎదురయ్యే అవకాశం ఉంది. దీంతో గూడూరు పట్టణ, శివారు ప్రాంతాల ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. అధికా రులు స్పందించి ముందస్తు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రాజధానుల పేరుతో ప్రజల మధ్య చిచ్చు

- ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం సరికాదు
- సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి

విశాలాంధ్ర - తిరుపతి : మూడు రాజధానుల పేరుతో రోజుకో నాటకం ఆడిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరి మార్చుకోవాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పి మురళి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆనాడు ప్రతిపక్షంలో ఉన్న ముఖ్యమంత్రివర్యులు ప్రజల మధ్య చిచ్చుపెట్టి విద్వేషాలు రెచ్చగొట్టే పార్టీ మాది కాదని, ప్రాణం పోయినా మాట తప్పే వంశం మాది కాదని అమరావతి రాజధానికి మేము కూడా ఒప్పుకుంటున్నామని అసెంబ్లీ సాక్షిగా ఒప్పుకున్నారు. ఈరోజు మాట తప్పి, మడమ తిప్పి ఏ విద్వేషాలు అయితే రెచ్చ గొట్టనని చెప్పాడో ఇప్పుడు అదే తరహాలో ప్రజలను రెచ్చగొట్టి రానున్న ఎలక్షన్లలో ఇదే ఒక అజెండాగా తీసుకెళ్తూ ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్న ఈ రాష్ట్ర ప్రభుత్వ మొండి వైఖరి మార్చుకోవాలని సూచించారు. కర్నూలులో హైకోర్టు ఉండాలని అన్ని రాజకీయ పార్టీలు ఒప్పుకున్నరన్న విషయం ప్రభుత్వం మరిచిపోయినట్లుందన్నారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు మంత్రి హోదాలో ఉండి ఒకే రాజధాని విశాఖనే అని ప్రకటించడం పట్ల ప్రజలకు మీరు ఏం చెప్పాలనుకున్నారో దానిపై మీకన్నా స్పష్టత ఉందా అని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్రానికి రావలసిన ప్రత్యేక హోదా, విశాఖ రైల్వే జోన్, ఉత్తరాంధ్రకు ప్రత్యేక అభివృద్ధికి సంబంధించి రావలసిన నిధులు ఇవన్నీ పక్కనపెట్టి ప్రజలను పక్కదోవ పెట్టించడానికి మాత్రమే ఈ మూడు రాజధానుల అంశాన్ని తెరపైకి తీసుకు వచ్చారని తెలిపారు. ఉత్తరాంధ్రకు వ్యతిరేకంగా మాట్లాడడానికి సిగ్గుండాలి అని ప్రశ్నించిన మంత్రి ధర్మాన ప్రసాద్ రావు గారి నోరు ఆనాడు ఏమైందన్నారు. ఒక్కసారిగా ఉత్తరాంధ్ర ప్రజలపై ఎందుకింత ప్రేమ పుట్టుకొచ్చిందో విశాఖ ప్రజలకు తెలుసని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం ఒక మంచి నిర్ణయం తీసుకొని అమరావతిని రాజధానిగా కొనసాగించాలని ఒక ప్రకటనలో తెలియజేశారు.

'తమ కుమార్తెను తమకు అప్పగించండి'

- చంద్రిత తల్లిదండ్రుల విజ్ఞప్తి

విశాలాంధ్ర -శ్రీకాళహస్తి: తమ కుమార్తె చంద్రితను తమకు అప్పగించాలని ఆ బాలిక తల్లిదండ్రులు చిర్రి లలితమ్మ, ఠాగూర్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వారు సోమవారం తిరుపతిలో ఎస్పీ పరమేశ్వరరెడ్డిని కలసి స్పందనలో వినతిపత్రం సమర్పించారు. తమ కుమార్తె చిర్రి చంద్రిత అనే 16ఏళ్ల బాలికను శ్రీకాళహస్తి మండలం రామాపురం గ్రామానికి చెందిన గెద్ది బత్తెయ్య కుమారుడు గెద్ది చంద్రశేఖర్ అనే వివాహితుడు మాయమాటలు చెప్పి దొరవారిసత్రం మండలం మైలాంగం గ్రామం నుంచి ఈ ఏడాది జనవరి 10వ తేదీన కిడ్నాప్ చేశాడన్నారు. అక్కడ తమ బంధువులు పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేక పోయిందన్నారు. గత నెల 20వ తేదీన కేవీబీపురం మండలం కోవనూరు సమీపంలోని తెలుగుగంగ కాలువలో ఓ యువతి శవం లభ్యం కావడంతో పోలీసులు తమకు సమాచారం ఇచ్చారన్నారు. శవం అప్పటికే కుళ్లి పోయి ఉండటంతో అది మా కుమార్తెదే అని పొరబాటున భావించామన్నారు. అయితే తాము బతికే ఉన్నట్లు చంద్రిత, చంద్రశేఖర్ సెల్ఫీ వీడియో సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారనన్నారు. తమ కుమర్తె మైనర్ అయినందున తమకు అప్పగించాలని కోరారు. అదేవిధంగా తమ కుమార్తెను మాయ మాటలతో మభ్య పెట్టిన తీసుకెళ్లిన చంద్రశేఖర్ పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యంబి పొంచి ఉన్న ప్రమాదం

విశాలాంధ్ర- చిట్టమూరు : మండల పరిధిలోని మల్లాం పంచాయతీ సమీపంలో మల్లాం నుంచి రావిగుంటపాలెం వెళ్లే రోడ్డు మార్గం ప్రక్కన ఉన్న పల్లంపత్తి సబ్ స్టేషన్ కి వెళ్లే విద్యుత్ మెయిన్ లైన్ కరెంటు స్తంభం రోడ్డు మీదకి ఒరిగి ప్రమాదకరంగా మారింది గమనించకుండా ఈ మార్గంలో ప్రయాణిస్తే కరెంటు వైర్లు తగిలి పెను ప్రమాదం సంభవించే అవకాశం ఉందని ప్రయాణకులు చెబుతున్నారు.గత సంవత్సరం కురిసిన వర్షాలకు ఇక్కడ ఉన్న కరెంటు స్తంభం కొద్దిగా పక్కకి ఒరిగింది అయితే కరెంటు శాఖ అధికారులు దీనిని సరి చేయకపోవడంతో గత రెండు రోజుల నుండి పడుతున్న వర్షాలకు భూమి బాగా తడిచి స్తంభం రోడ్డు మీదకు వాలడంతో అటుగా వెళ్లే ప్రయాణికులకు ప్రమాదం జరిగే అవకాశం ఉంది కావున వెంటనే విద్యుత్ శాఖఅధికారులువెంటనేస్పందించిఈ స్తంభాన్ని సరి చేయకపోతే పెను ప్రమాదం జరిగే అవకాశం ఉందని వాహనదారులు చెబుతున్నారు.

యన్‌జిసి రాష్ట్ర డైరెక్టర్‌చే విశ్వం సైనిక్ - మిలటరీ స్కూల్స్ 2023 స్టడీమెటీరియల్ ఆవిష్కరణ

విశాలాంధ్ర - తిరుపతి : స్థానిక వరదరాజనగర్ లోని విశ్వం టాలెంట్ స్కూల్ నందు సైనిక్,నవోదయ మరియు మిలిటరీ స్కూల్స్ 2023 ప్రవేశ పరీక్షకు స్టడీ మెటీరియల్ ఆవిష్కరణ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నేషనల్ గ్రీన్ కార్ప్స్ డైరెక్టర్ వి.స్రవంతి,రాష్ట్ర అర్బన్ డెవలప్మెంట్ సిఈఓ ఏ.నారాయణ రెడ్డి, విశ్వం విద్యా సంస్థల అధినేత డాఎయన్.విశ్వనాథ్ రెడ్డి,అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వ చందన్ రెడ్డి మరియు అప్పస్మా నాయకులు రామ్ మోహన్ రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించబడింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య అతిథిలు మాట్లాడుతూ విశ్వం విద్యా సంస్థల యాజ మాన్యం విద్యార్థులకు స్కూల్ సిలబస్ తో పాటు వివిధ పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తు ఉత్తమ ఫలితాలను సాధిస్తునందుకు అభినందించారు. ఈ సందర్భంగా డాఎయన్.విశ్వనాథ్ రెడ్డి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో 08జనవరి2023న జరిగే సైనిక్ ఎంట్రన్స్ టెస్ట్ తో పాటు మిలిటరీ స్కూల్స్,ఆర్ఐయంసి వంటి పోటీ పరీక్షలకు సిద్ధమవుతున విద్యార్థిని విద్యార్థులకు ఉతిర్ణత సాధించడానికి మరియు ఉత్తమ ర్యాంకులు సాధించడానికి ఈ స్టడీ మెటీరియల్ ఎంతగానో ఉపయోగ పడుతుందని తెలిపారు.గత 32 సంవత్సరాలుగా సంచలన ఫలితాలు సాధించి రికార్డులు తిరిగి రాయడం తమ విద్యార్థుల ఫలితాలలో సాధ్యమవుతుందని ధీమా వ్యక్తం చేశారు.పిల్లల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తూ విద్యే ప్రథమ ధ్యేయంగా బోధిస్తు స్ఫూర్తిదాయకమైన విద్యను అందిస్తూ విజయ సాధనకు తోడ్పడటం "విశ్వం" విద్య సంస్థలకు సాధ్యం అని తెలియజేశారు. ఈ పోటీ పరీక్షలకు సంబంధించి మరిన్ని వివరాలకు 9399976999/8688888802 ఫోన్ నంబర్లను సంప్రదించగలరు.

పొట్టి శ్రీరాములు పోరాటం స్ఫూర్తిదాయకం

విశాలాంధ్ర - కార్వేటినగరం: ఆంధ్ర ప్రజల ఆత్మ గౌరవం కోసం పొట్టి శ్రీరాములు చేసిన పోరాటం తెలుగువారందరికీ స్ఫూర్తిదా యకమని ఎంపీడీవో మోహన మురళీ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆవతరణా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంపీపీ లతబాలాజీ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి త్రివర్ణ పతకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవా మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఆయన ఆంధ్ర ప్రజలకు ఆదర్శ వంతుడని చెప్పారు. అదే విధంగా మండల విద్యాశాఖ కార్యాలయంలో కూడా ఎంఈవో విజయకుమార్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళ్లు ఆర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ ధనంజయవర్మ. ఈవొ పీఆర్డీ లక్ష్మిపతి, హౌసింగ్ ఏఈ యోగేంద్రనాయుడు, సీనియర్ అసిస్టెంట్ క్రిష్ణయ్య, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన వెంకటగిరి పోలీసులు

విశాలాంధ్ర - వెంకటగిరి : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా... వెంకటగిరి పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీ.కె. రామకృష్ణ గారి ఆధ్వర్యంలో వెంకటగిరి పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ రక్తదాన శిబిరంలో సీఐ రామకృష్ణ గారితో పాటు ఎస్ఐలు, 75 మంది పోలీస్ సిబ్బంది మరియు పట్టణంలోని యువతి, యువకులు పాల్గొని తమ రక్తాన్ని దానం చేశారు... ఈ కార్యక్రమంలో సిఐకె.రామకృష్ణ,ఎస్సైసి. హెచ్‌కోటిరెడ్డి, డక్కిలి ఎస్ఐ నరసింహారావు బాలాయపల్లి ఎస్సై సుధాకర్ రెడ్డి, ప్రభుత్వాసుపత్రి వైద్యురాలు డాక్టర్.కవిత, గూడూరు ప్రభుత్వ రక్తనిధి కేంద్రం డాక్టర్ సందీప్, ఆసుపత్రి సిబ్బంది, పోలీస్ సిబ్బంది, ఈ ఎస్ ఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు, మరియు పట్టణంలోని యువతీ, యువకులు పాల్గొన్నారు.

9వ బటాలియన్‌లో ఘనంగా ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర - వెంకటగిరి: ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం" పురస్కరించుకొని. నేడు అనగా 1 నవంబర్ 2022 మంగళవారం ఉదయం 8.45 నిమిషాలకు... తిరుపతి జిల్లా, వెంకటగిరి మండలం, 9వ బెటాలియన్‌లో.బటాలియన్ కమాండెంట్ .పి.ప్రకాష్ ఆధ్వ ర్యంలో. ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా కమాండెంట్ పి.ప్రకాష్ మరియు అడిషనల్ కమాండెంట్ పి.అరుణ్ బోసు గారు.ఆంధ్ర రాష్ట్రానికి అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాలను, సేవలను గుర్తు చేశారు. ఈ సందర్భంగా పోలీస్ పెరేడ్ నిర్వహించారు. ఇంకా ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్స్ సత్యం నాయుడు, రామకుమార్, చంద్ర మౌళి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బొజ్జల సుధీర్ రెడ్డిని అరెస్టు చేయండి : దళిత నేతల డిమాండు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: టీడీపీ నేత బొజ్జల సుధీర్ రెడ్డిని అరెస్టు చేయాలని వైసీపీకి చెందిన దళిత సంఘం నేతలు డిమాండు చేశారు. ఈ మేరకు వారు సోమవారం శ్రీకాళహస్తి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ అంబేడ్కర్ విగ్రహం నుంచి పట్టణంలోని మాడ వీధులగుండా శ్రీరామనగర్ కాలనీలోని డీయస్పీ కార్యాలయం వరకు సాగింది. సుధీం ౯రెడ్డి శవరాజకీయాలు చేస్తున్నారన్నారని వారు ఆరోపించారు. చంద్రశేఖర్ దళితుడు కావడం వలనే సుధీర్ ఇలా చేశారన్నారు. తాము క్షేమంగా ఉన్నామని ప్రేమ జంట సామాజిక మాధ్యమాల్లో ఆదివారం వీడియో పోస్టు చేయడం తో టిడిపి నాయకులు బొజ్జల సుధీర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన డ్రామా బట్టబయలు అయ్యిందని తెలిపారు. సుధీర్‌రెడ్డి నిజాలు తెలుసుకోకుండా గత వారం రోజులుగా హైడ్రామా చేశాడని దళితనాయకులు విమర్శించారు. దళితులంటే రౌడీలని, హంతకులని చూపించాలని సుధీర్‌రెడ్డి ప్రయత్నించారని వీఎంపల్లె వారంతా రౌడీలు అంటూ మాట్లాడటం బాధకలి గించిందని విమర్శి ంచారు. దళితులంతా ఐక్యంగా ఉంటే చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని వారు ఆరోపించారు. అనంతరం డీఎస్పీ విశ్వ నాథ్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి సభ్యురాలు పసలసుమతి,ఎస్సీసెల్ నియోజకవర్గ అధ్యక్షుడు గాదిపాకుల కిరణ్, పసల సురేష్, కిరణ్,రాజేంద్ర,కష్ణయ్యదళిత నాయకులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

టాస్క్ ఫోర్సులో ఏపీ అవతరణ దినోత్సవం

విశాలాంధ్ర - తిరుపతి క్రైమ్ : ఆంధ్ర అవతరణ దినోత్సవాన్ని బుధవారం టాస్క్ ఫోర్సు లో ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరా ములు చిత్ర పటానికి పుష్పా ంజలి ఘటించారు. ఆంధ్ర రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్ని ఈ సందర్భంగా కొని యాడారు. టాస్క్ ఫోర్సు సిబ్బంది పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి సెల్యూట్ నిర్వహించారు. ఈ కార్యక్రమయంసీఐ చంద్రశేఖర్,రిజర్వుఇనస్పెక్టరు సురేష్ కుమార్ రెడ్డి అధ్వర్యంలో నిర్వహించారు.

ఆర్చరీ పోటీలలో నారాయణ విద్యార్థిని ప్రతిభ

విశాలాంధ్ర - గూడూరు : గూడూరు నారాయణ ఇంజినీరింగ్ కలశాలలో ఈసీఈ విభాగంలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఎం. సాత్విక అనంతపురం జేఎన్టీయూ విశ్వవిద్యా లయం పరిధిలో నిర్వహించిన ఆర్చరీ ఎంపికలలో రికర్వ్ విభాగంలో అత్యున్నత ప్రతిభను కనబరిచి ల్ ఇండియా అంతర విశ్వవిద్యాలయం పోటీలకు స్థానం కైవసం చేసుకుంది.పంజాబ్ రాష్ట్రం భటిండాలోని గురుకాశి విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న ఆల్ ఇండియా అంతర విశ్వ విద్యాలయాల స్థాయి పోటీలలో జేఎన్టీయూ తరపున ప్రాతినిధ్యం వహించనుంది. మంగళవారం నారాయణ ఇంజినీరింగ్ కళాశాలలో సాత్వికకు అభినందన సభ ఏర్పాటుచేశారు.ఈ సందర్భంగా కళాశాల మేనేజింగ్ డైరెక్టర్ వై. వినయ్ కుమార్ మాట్లాడుతూ క్రీడలుజట్టుకృషి,జవాబు దారీతనం, ఆత్మ విశ్వాసం, బాధ్యత, స్వీయ క్రమశిక్షణ వంటి జీవిత పాఠాలను నేర్పుతుందన్నారు. పాఠశాలలో క్రీడలు విద్యార్థులను జీవితంలోని సవాళ్లను ఎదుర్కొనేలాసిద్ధంచేస్తాయన్నారు. అవి విద్యార్థుల శారీరక, మానసిక సామర్థ్యాలను పెంపొందిస్తా యన్నారు. వారి జీవిత లక్ష్యాలను సాధించడంలో సహాయపడతాయన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఏవీఎస్.ప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలపట్ల ప్రోత్సాహం కల్పించేందుకు నారాయణ కళాశాలఎల్లప్పుడూ ముందువరుసలో ఉంటుందన్నారు.అనంతరం విద్యార్థిని సాత్వికకు చిరు జ్ఞాపికను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వీ.రవిప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ కే.విశ్వక్‌సేనారెడ్డి,ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ పీ. శ్రీనివాసులు, ఏఓ పీవీ. కొండారెడ్డి, అర్జున ఆర్చరీ అకాడమి, గూడూరు కోచ్ శివశంకర్ మాస్టర్, స్పోర్ట్స్ కో ఆర్డినేటర్ ఎన్. కేశవరావు,ఫిజికల్‌డైరెక్టర్ఎంవీ.రాఘవయ్య తదితరులు విద్యార్థినికి ప్రత్యేక అభినందలు తెలిపారు.

ఆప్స్ మరియు విశ్వం స్కూల్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూల మాల వేసి నివాళులు

విశాలాంధ్ర -తిరుపతి : ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ సందర్భంగా సోమ వారం ఉదయం తిరుపతి రుయా ఆసుపత్రి ఎదురుగ గల పొట్టి శ్రీరాములు విగ్రహానికి ఆంధ్రప్రదేశ్ అభివృది పోరాట సమితి (ఆప్స్) రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాజా రెడ్డి మరియు విశ్వం విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ యన్.విశ్వ చందన్ రెడ్డి ఆద్వర్యంలో పూలమాలలు వేసి నివాళులు అర్పించ డం జరిగింది. ఈ సందర్భంగా ఆప్స్ రాష్ట్ర అధ్య క్షులు ఎన్. రాజా రెడ్డి మాట్లాడుతూ భాష ప్రయుక్త రాష్ట్రం కోసం తెలుగు మాట్లాడే వారికి ప్రత్యేక రాష్ట్రం కోసం 58రోజులు చెన్నై నగరంలో ఆమరణ నిరాహార దీక్ష చేసి అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణా ర్పణ చేసారని అనంతరం కేంద్ర ప్రభు త్వం 1956 నవంబర్ 1 న ఆంధ్రప్రదేశ్ ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.శంకరంబాడి సాహితీ పీఠం వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ డి మస్తానమ్మ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి తన ప్రాణాలను కోల్పోయిన అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాన్నిస్మరించుకుంటూ నవంబర్ 1న ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటునాము అని తెలిపారు.ఈ కార్యక్రమం లో లివై ఎస్ ఆర్ టీ యూ సి రాష్ట్ర నాయకులు మాండ్ల రాజేశ్, ఆప్స్ జిల్లా అధ్యక్షులు షేక్ మహ్మద్ రఫీ మరియు విశ్వం స్కూల్ విద్యార్తులు పాల్గొన్నారు.

వదంతులు నమ్మవద్దు : వెంకటగిరి సీఐ

విశాలాంధ్ర - వెంకటగిరి: వెంకటగిరి పట్టణ మరియు చుట్టూ పక్కల ప్రాంతాల ప్రజలకు పోలీస్ వారి విజ్ఞప్తి. గత వారం రోజుల నుండి పిల్లలను పట్టుకొని వెళ్లేవారు వచ్చారని, ఊర్లో తిరుగుతున్నారని, అనే వార్తలు నమ్మవద్దు. మంగళవారం వెంకటగిరి మోడల్ స్కూల్ సమీపంలో యాచకులు సంచరిస్తూ ఉండడంతో వారిని స్థానికులు పట్టుకొని బీహార్ కు చెందిన పిల్లలను ఎత్తుకొని వెళ్లి గ్యాంగ్ గా అనుమానంతో పోలీస్ స్టేషన్ కి అప్పగించారు వారిని విచారించగా బిచ్చగాడు గుర్తించారు గత మూడు రోజుల క్రితం ఇదేవిధంగా బస్టాండ్ ప్రాంతంలో కొందరిని స్థానికులు పట్టుకొని కొట్టడం జరిగింది వెంకటగిరి సీఐ రామకృష్ణ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ వెంకటగిరి ప్రజలకు నిత్యం పోలీసు వారు అందుబాటులో ఉన్నామని ఎటువంటి సమస్య ఉన్న100 గాని పోలీస్ స్టేషన్లో గాని సమాచారం ఇవ్వండి. వెంటనే మీ సమస్యలను పరిక్షరిస్తామని సీఐ రామకృష్ణ, ఎస్సై కోటిరెడ్డి తెలిపారు.

పిఆర్టియు జిల్లా అధ్యక్షుడిగా బాలు

విశాలాంధ్ర- వెంకటగిరి: నూతనంగా ఏర్పడిన తిరుపతి జిల్లా పిఆర్టియు జిల్లా అధ్యక్షులు గా ఎన్నికైన వి. బాల సుబ్రహ్మణ్యంకు పిఆర్టియు నాయకులు తోటి ఉపాధ్యాయులు హృదయ పూర్వక అభినందనలు. తెలియజేశారు అంచలంచులుగా జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఎదగాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు.

అడుగడుగున గుంతలే...?

ప్రయాణం నరకం
చిన్నపాటి వర్షానికి బురద మయం

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ : అడుగడుగునా గుంతల మయమై రోడ్డు పై ప్రయాణం చేయాలంటే వాహన చోదకులకు నరకం కనబడుచున్నది. మండలంలోని తడ శ్రీకాళహస్తి ప్రధాన రోడ్డు నుండి ఆలత్తూరు గ్రామానికి వెళ్లే ఈ రహదారి చాలా దుర్భరంగా ఉన్నది. ప్రజల సౌకర్యార్థ కోసం గత ప్రభుత్వంలో సుమారు కోటి 1. 40 లక్షల రూపాయలు వ్యయంతో బీటి రోడ్డును వేశారు, నిత్యం క్వారీ రాళ్లు తరలించే భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు బాగా ధ్వం సమై గుంతల మయమైనది. దీంతో చిన్నపాటి వర్షానికే గుంతలలో జలమైపోయాయి, ఈ రహ దారికి అనుబంధంగా ఉన్న గ్రామాలు రాకపోకలు కొనసాగించుటకు తీవ్రఇబ్బందులు ఎదుర్కొం టున్నారు, ద్విచక్ర వాహనం, కారు, ట్రాక్టర్ లు వేగంగా వెళ్లలేని దుస్థితి, వాహనం నెమ్మదిగా వెళ్తే వాహనాలు దిగబడిపోతున్నాయి, క్వారీల పుణ్యమాంటూ బాగున్న రోడ్డు ధ్వంసం కావ డంతో చుట్టు ప్రక్కల గ్రామాల ప్రజలు ప్రయాణం కొనసాగించాలంటే నరకం కనబడుచున్న దంటు ఆందోళన చెందుతున్నారు, కురుస్తున్న వర్షాలకు, ఆయా గ్రామాల నుంచి పలు ప్రభుత్వ కార్యాలయాల్లో విధిల నిర్వహణకు వెళ్లేటువంటి ఉద్యోగస్తులు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు, ఎలా ప్రయాణం కొనసాగించాలని వాపోతున్నారు, అడుగడుగున గుంతలు ఏర్పడటంతో చిన్నపాటి వర్షానికి చిత్తడి చిత్తడిగా మారిపోయింది, వర్షాన్ని సైతం లెక్కచేయ కుండా భారీ వాహనాలు జోరుగా రాక పోకలు కొనసాగిస్తున్నాయి, స్పందించే అధికారులు లేకపోవడంతో ప్రయాణికులు బాధలు వర్ణతీతంగా ఉన్నాయి. జిల్లా అధికారులు స్పందించి రోడ్డును బాగు చేసే విధంగా చర్యలు చేపట్టవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

ప్రైవేట్ ఫైనాన్సుల వేధింపులతో ఆత్మహత్య

- పరువు కోసం ప్రాణం విడిచి
- నిబంధనలు పాటించని ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలు
- ప్రైవేట్ కంపెనీ కలక్షన్ ఏజెంట్ల ఇష్టరాజ్యం
- పోలీస్ స్టేషన్లో కేసు నమోదు

విశాలాంధ్ర - దొరవారి సత్రం : ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల రికవరీ ఏజెంట్ల మాట తీరు ఓ నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. ఇచ్చిన రుణం సరైన వాయిదాల కట్టలేదని చివరికి గ్రామంలోని ఇంటి వద్దకు వచ్చి నోటికి వచ్చిన దుర్భాష తో మాట్లాడి చివరికి అతను ప్రాణం పోయేందుకు కారణమయ్యాడు. ప్రైవేటీ కంపెనీ ఏజెంట్లు ప్రభుత్వ నిబంధన పాటించకొక వారి ఇష్టరాజంగా వ్యవహరించడం తో నిండు ప్రాణాలు బలి అవుతున్నాయి. ఇప్పటికైనా ప్రైవేట్ కంపెనీ కలెక్షన్ ఏజెంట్ల మాట తీరుపై చర్యలు తీసుకోవాలని పలువురు అంటున్నారు.దొరవారి సత్రం మండల పరిధిలోని ఆరిమెని కండ్రిగ గ్రామానికి చెందిన జగన్నాథం (31) నాయుడుపేట పట్టణానికి చెందిన ఓ ప్రైవేట్ ఫైనాన్స్ వారి వేధింపులకు తట్టుకోలేక పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకొన్న సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు వివరాల మేరకు ఓ జగన్నాథం నాలుగేళ్ల క్రితం ఫైనాన్స్ కంపెనీలో ట్రాక్టర్‌ను కొనుకు నాడు. ఆర్థిక పరిస్థితులు వల్ల సక్రమంగా వాయిదాలు చెల్లించలేకపోవడంతో ఉన్న నగదుకు అదనంగా వడ్డీ పెరిగింది.దీంతో కలెక్షన్ ఏజెంట్లు రంగంలోకి దిగి జగన్నాథం ఇంటికి వచ్చి జగన్నాథం ను డబ్బులు కట్టాలి లేకపోతే ట్రాక్టర్ ఎత్తుకెళ్లిపోతామంటూ బెదిరించే వారిని స్థానికులు తెలిపారు. ఈ క్రమంలోనే నాయుడుపేట పట్టణం చెందిన పలువురు వ్యక్తులు పదే పదే ఇంటి మీదకు వచ్చి జగన్నాథం నానా బూతులు తిట్టి ట్రాక్టర్ ను తీసుకెళ్తాము అవమానంగా మాట్లాడడంతో తట్టుకోలేక సోమవారం పురుగు ముందు త్రాగడు. పురుగు మందు తాగిన జగన్నాథనీ కాళహస్తి లోని ప్రైవేట్ హాస్పిటల్ లో చేర్చగా అక్కడ చికిత్స పొందుతూ జగన్నాథం మృతి చెందాడు. మృతి చెందిన జగన్నాథం భార్య ఉంది.మృతదేహం వద్ద రోదనలు జగన్నాథం మృతదేహం వద్ద స్థానికులు బంధువులు కుటుంబ సభ్యులు ఎంత పని చేశావు జగన్నాథం అంటూ కన్నీటి మున్నేరు అవుతున్నారు.జగన్నాథం ఇంకా లేరని వార్త కన్న తల్లిదండ్రులు రోది స్తున్నారు. మాట పడని జగన్నాథాన్ని ప్రైవేట్ కంపెనీ కలెక్షన్ ఏజెంట్లు నోటికి వచ్చిన మాటలు అనడమే కాక వాళ్లు అసహ్యంగా మాట్లాడి అతని మనసును పరిచి అతను చావుకి కారణమయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా కలెక్షన్ ఏజెంట్లు రౌడీ గూండాల్లా గ్రామాల్లో వచ్చి వారి ప్రతాపం చూపిస్తున్నారు అంటూ దానికి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి కారణమైన వారిపై చర్యలు తీసుకునే వారికి తమ పోరాటం ఆగదని కొన్ని స్వచ్ఛంద సంస్థలు వారికి అండగా నిలుస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుత్తూరు పురపాలక సంఘము, పుత్తూరు

ఆర్.ఓ.సి.నెం.1197/ఇ1/2021, తేది:01.11.2022

ఇ ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు (3rd Call) నెం.09/ఇ1/2022-23

పుత్తూరు పురపాలక సంఘము నందు 15వ ఆర్థిక సంఘపు నిధుల నుండి ఒక్క పనికిగాను(నిట్ నెం.36/2022-23) రిజిష్టరు కాంట్రాక్టర్ల నుండి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనది. సదరు పనికి సంబంధించిన పూర్తి వివరములు ఇప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ నందు చూడవలెను.

http://tender.apeprocurement.gov.in

కమీషనరు
పుత్తూరు పురపాలక సంఘం

12న జాతీయ లోక్ అదాలత్

విశాలాంధ్ర - చిత్తూరు: ఈనెల 12 న జిల్లా కోర్టు నందు జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఐ. కరుణ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జిల్లా న్యాయసేవ అధికారి సంస్థ కార్యాలయం నందు ఈనెల 12న జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం పై మీడియా సమావేశం నిర్వహించారు. సత్వర న్యాయం పొందడానికి సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఈనెల 12న జిల్లా కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించడం జరుగుతుందని, ఈ లోకదాలత్ కార్యక్రమంలో న్యాయ పరమైన కేసులను పరిష్కరించుకోవడానికి కక్షదారులకు మంచి అవకాశమని తెలిపారు. కోర్టుకు వెళ్లే ముందు జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థ, మండల న్యాయ సేవ అధికార సంస్థలు వద్దకు వెళ్లి ప్రీలిటికేషన్ కేసులు పరిష్కరించుకోవచ్చునని తెలిపారు.లోక్అదాలతో కేసులు పరిష్కరించుకోవడం వల్ల కక్షదాలరులకు సమయం, డబ్బు ఆదా అవుతుందని,అంతే కాకుండా ఇద్దరి మధ్య స్నేహపూర్వం కలుగుతుందన్నారు. బీమా,చిట్ ఫండ్ సంస్థలు, మోటార్ వాహనాల ప్రమాదాలు, చెక్కు బౌన్స్ వంటి కేసులను పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో ఎక్కువ కేసులు పరిస్కారం చేయుటకు, భీమా, చిట్ ఫండ్ సంస్థలు, కక్షదారులు సహకరించాలని చూచించారు. లోక్ అదాలత్‌లో ఇచ్చిన తీర్ప సుప్రీంకోర్టు తీర్పుతో సమానని తెలిపారు.

తుఫాను తాకిడి... అందరూ అప్రమత్తం కావాలి..!

ప్రజలకు అందుబాటులో ఉండాలి - ప్రమాదకర పరిస్థితులను ముందుగా గుర్తించాలి
- తుఫాను ప్రభావంపై అధికారులతో ఎమ్మెల్యే చెవిరెడ్డి సమీక్ష

విశాలాంధ్ర - తిరుపతి : తుఫాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు ప్రజలు ఇబ్బందులు పడకుండా మండల స్థాయి అధికారులు అందుబాటులో ఉండి సహాయక చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సూచించారు. మంగళవారం తుడా కార్యాలయంలోని సమావేశ మందిరంలో మండల స్థాయి ప్రభుత్వ అధికారులు, నీటిపారుదల, పంచాయతీ రాజ్, విద్యుత్ శాఖలకు చెందిన ఇంజనీర్లతో సమావేశం నిర్వహించారు. వాతావరణ శాఖ సూచనల మేరకు జిల్లా వ్యాప్తంగా మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయన్న సమాచారం మేరకు అందరూ అప్రమత్తం కావాలన్నారు. గతంలో వచ్చిన వరద ప్రభావిత ప్రాంతాలను గుర్తించి ఆయా ప్రాంతాల్లో ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కాలువలు, వాగులు, చెరువుల వద్ద తరచుగా పర్యవేక్షణ చేసి ప్రమాదకర పరిస్థితులను అంచనా వేసి లోతట్టు ప్రాంతాల వారిని అప్రమత్తం చేయాలన్నారు. అలాగే వర్షం తాకిడికి ప్రజతలెత్తే సమస్యల వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు ఆయా గ్రామ సచివాలయ ఉద్యోగులు, వాలంటీర్లను భాగస్వామ్యం చేయాలన్నారు.

చెరువులపై నిరంతర పర్యవేక్షణ చేయాలి: భారీ వర్షాలు కురుస్తున్న నేపద్యంలో ప్రమాదకర చెరువులు, నీటి కుంటలపై నిరంతరం పర్యవేక్షణ చేస్తూ ఎప్పటికప్పుడు ప్రజలకు సమాచారం అందించాలని నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. వర్షం కారణంగా పాతబడిన ఇల్లు, గుడిసెలు, ప్రభుత్వ భవనాలు వద్ద ఎవ్వరూ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు వరద ప్రభావితం ఉన్న ప్రాంతాలను గుర్తించి మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకుని వచ్చేలా అప్రమత్తం చేయాలన్నారు. అలాగే అతి పెద్ద జలాశయాలు వద్ద సందర్శకులను మూడు రోజుల పాటు అనుమతించక పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. పల్లెల్లో వర్షం కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు.

రామాయణ, భారత, భాగవత గ్రంథాల పునర్ముద్రణకు చర్యలు : టిటిడి జెఈవో సదా భార్గవి

విశాలాంధ్ర -తిరుపతి: రామాయణ, భారత, భాగవత గ్రంథాల పునర్ముద్రణకు చర్యలు తీసుకుంటామని టిటిడి జెఈవో శ్రీమతి సదా భార్గవి తెలిపారు. మంగళవారం ఆమె ప్రెస్, పబ్లికేషన్స్, సేల్స్‌వింగ్, సప్తగిరి మాసపత్రిక కార్యాలయాలను పరిశీలించారు. ప్రెస్ ఆధునీకరణ, సేల్స్ వింగ్ బలోపేతం, సప్తగిరి మాసపత్రిక మరింతగా ఆకట్టుకునేలా ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన అంశాలపై అధికారులతో సమీక్షించారు.అనంతరం జెఈవో మాట్లాడుతూ ప్రెస్‌ను రాబోయే 25 సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని యంత్రాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి వారం రోజుల్లో సమగ్ర కార్యాచరణ ప్రణాళిక అందించాలని అధికారులను ఆదేశించామన్నారు. పబ్లికేషన్ విభాగాన్ని బలోపేతం చేసి సనాతన హిందూ ధార్మిక ప్రచారానికి సంబంధించిన గ్రంథాలు, పుస్తకాలు, పురాణాలను ప్రజోపయోగంలోకి తీసుకొస్తామని చెప్పారు. జెఈవో వెంట డిఎఫ్‌వో శ్రీనివాస్, చీఫ్ ఎడిటర్ డా.రాధారమణ, ఎడిటర్ డా.చొక్కలింగం, ప్రెస్ ప్రత్యేకాధికారి రామరాజు, ప్రచురణల విభాగం ప్రత్యేకాధికారి ఆచార్య రేమిళ్ల వెంకటకృష్ణశాస్త్రి, డిఇవో భాస్కర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చప్పిడిపల్లిలో ఫ్యామిలీ ఫిజీషియన్‌పై అవగాహన

విశాలాంధ్ర -బైరెడ్డిపల్లె : బైరెడ్డిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఆధ్వర్యంలో చప్పిడి పల్లి గ్రామం నందు డాక్టర్ వైయస్సార్ ఫ్యామిలీ ఫిజీషియన్ డాక్టర్ శాలిని రక్తపోటు మధుమేహము మరియు గర్భవతులకు వైద్య పరీక్షలు చేసి మందులు ఇవ్వడం జరిగినది. పి సావిత్రి ఎల్తేజికేటర్ ఆరోగ్యం పై అవగాహన కల్పిస్తూ సంక్రమణ, అసంక్రమణ వ్యాధుల గురించి జ్వరములు నివారణ గురించి పరిసరాల పరిశుభ్రత గురించి చెప్పినారు. చప్పిడి పల్లి స్కూల్ పిల్లలకి వ్యక్తిగత పరిశుభ్రత గురించి పోషకాహారం గురించి చేతులు శుభ్రత గురించి తెలిపినారు. ఈ కార్యక్రమాలకు ఎం ఎల్ హెచ్ పి అశ్విని,ఏఎన్ఎం లక్ష్మి ప్రసన్న,ఎర్రం రెడ్డి, ఆశ కార్యకర్తలు హాజరైనారు.

తెలుగు మహిళల 'మాటా -మంతి'

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: వైసీపీ ప్రభుత్వం చేస్తున్న మోసాలను, ప్రజా వ్యతిరేక విధానాలను మహిళలకు వివరించడానికి తెలుగు మహిళల ఆధ్వర్యంలో 'మాటా-మంతి' కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించినట్లు తిరుపతి పార్లమెంటు మహిళా అధ్యక్షురాలు చక్రాల ఉష తెలిపారు. మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర తెలుగుమహిళ అధ్యక్షురాలు వంగలపూడి అనిత ఆధ్వర్యంలో జరిగిన సమావేశం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె తెలిపారు.వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో మహిళలపై జరిగే అఘాయిత్యాలపై మహిళా కమిటీలు పోరాటం చేసే తీరుని చంద్రబాబు నాయుడు, నారా లోకేష్, అచ్చెమనాయుడు ప్రశంసించారన్నారు. అదే స్ఫూర్తితో తెలుగు మహిళలపై నమ్మకంతో రాష్ట్ర ప్రజలను, మహిళలను ఈ ప్రభుత్వం మోసం చేస్తున్న విధానాన్ని మహిళలకి అర్థమయ్యేలా వివరించాలని ఉద్దేశ్యంతో రాష్ట్రంలోని 25 పార్లమెంట్లలోని... 25 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్టుగా మాటా-మంతి కార్యక్రమాన్ని నిర్వహించాలని నిర్దేశం చేశారన్నారు. ఇందులో భాగంగా తిరుపతి పార్లమెంటు పరిధిలోని వెంకటగిరి నియోజకవర్గాన్ని ఎంచుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమాన్ని నియోజక వర్గ ఇంచార్జి సలహాల మేరకు నిర్వహించాలని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు మహిళా కార్యదర్శులు డాక్టర్ వరలక్ష్మి, గూండాల లీలావతి, తిరుపతి పార్లమెంట్ తెలుగు మహిళా అధ్యక్షురాలు చక్రాల ఉష, తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళా వర్శిటీలో రాష్ట్రావతరణ దినోత్సవం

విశాలాంధ్ర - తిరుపతి ఎస్వీయూ: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా ఎన్ఎస్ఎస్ యూనిట్ - I, న్యాయ విభాగం సంయు క్తంగా పర్యావరణ పరిరక్షణ కోసం మంగళవారం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం రెండు వారాల పాటు బ్రహ్మ కుమారీస్ కల్ప తరువు కమ్యూనిటీ డెవల ప్మెంట్ అనుసంధానంగా నిర్వహించడం జరుగుతుందని వర్శిటీ రిజిస్ట్రార్ ఆచార్య డి.ఎం మమత తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ఆచార్య కాత్యాయని, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిని డాక్టర్ సునీత, డాక్టర్ శిరీషా, న్యాయ విభాగాధిపతి డాక్టర్ మాధురీ, లా-సెట్ కన్వీనర్ ఆచార్య సీతాకుమారి, న్యాయ విభాగం విద్యార్థినిలు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

శ్రీసిటీనిసందర్శించిన 'ఘనవ్యర్థాల నిర్వహణ అంతర్జాతీయసదస్సు' కార్యాచరణకమిటీ



విశాలాంధ్ర- సత్యవేడు: ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ వేస్ట్ మేనేజ్‌మెంట్,ఎయిర్ అండ్ వాటర్ సంస్థ చైర్మన్ ప్రొఫెసర్ సదానంద్ ఘోష్ నేతృత్వంలో 12వ అంతర్జాతీయ సస్టైనబుల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ సదస్సు కార్యాచరణ కమిటీకి చెందిన8 మంది సభ్యుల బృందం మంగళవారం శ్రీసిటీని సందర్శించింది.శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ వారికి సాదర స్వాగతం పలికారు.శ్రీసిటీ ప్రగతి, పచ్చదనం,పరిశుభ్రతతోపాటు వర్క్ లివ్ లెర్న్ - ప్లే సూత్రంపై నిర్మించబడి28 విభిన్న దేశాలకు చెందిన 200కు పైగా కంపెనీలతో, 50 వేల మందికి పైగా ఉద్యోగులతో 'మేక్ ఫర్ ది వరల్డ్'గాఅభివృద్ధి చెందుతూ సుస్థిర పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థనుశ్రీసిటీ ఎలా నెలకొల్పిందోవివరించారు.శ్రీసిటీ క్రియాశీల సుస్థిరత కార్యక్రమాలను ప్రశంసించిన ప్రొ. ఘోష్, 'గ్రీన్ సిటీ'గాశ్రీసిటీని తీర్చిదిద్దడంలో యాజమాన్యకృషిని అభినందించారు. ఈ స్థాయిలోదేశంలోని ఇతర పారిశ్రామిక హబ్‌లలో ఇటువంటి నిబద్ధత గమనించలేదన్నారు.అనంతరం బృంద సభ్యులు శ్రీసిటీ పరిశ్రమల సీనియర్ మేనేజర్లతో సమావేశమై పరస్పరం చర్చించారు.సదస్సులో పాల్గొనవలసిందిగా వారిని ఆహ్వానించారు.సాలిడ్ అండ్ లిక్విడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పాలసీ,వినూత్న ఆవిష్కరణలు, అమలుకు సంబంధించిన పలు అంశాలపై ఈ సదస్సులో చర్చిస్తారని చెప్పారు.స్పాన్సర్ షిప్ ద్వారా కూడా నిర్వాహకులకు మద్దతు ఇవ్వాలనిపరిశ్రమలప్రతినిధులకుఆయన విజ్ఞప్తి చేశారు. తమ పరిసరాలలో పచ్చదనం పెంపొందించడానికిపరిశ్రమలు చేపడుతున్న కొన్ని ఉత్తమ పద్ధతులనుతెలియచేయాలని వారిని కోరారు.రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలిడిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శశికళ,తిరుపతి వెంకటేశ్వర విశ్వవిద్యాలయం డీన్ (రీసెర్చ్ డెవలప్మెంట్) ప్రొఫెసర్‌విజయభాస్కర్ రావు,వంశీ,తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌సూపరింటెండెంట్ రవి, స్వచ్ఛ ఏపీకార్పొరేషన్‌మాజీ చైర్ పర్సన్ డాక్టర్ సీఎల్‌వెంకట్ రావుసమావేశంలో పాల్గొన్నారు.

లబ్దిదారులకు కేటాయించిన గృహ నిర్మాణాలు వేగవంతంకావాలి : కలెక్టర్

విశాలాంధ్ర- తిరుపతి : తిరుపతి నగరపాలక పరిధిలో లబ్దిదారులకు కేటాయించిన గృహ నిర్మాణాలు వేగవంతం కావాలని మెటీరియల్ సరఫరా కోసం ప్రత్యేక అధికారిని నియమించాలని జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి అన్నారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక కలెక్టరేట్ లో నగరపాలక సంస్థ పరిధిలో కేటాయించిన గృహ నిర్మాణాల పురోగతిపై నగరపాలక కమీషనర్ అనుపమ అంజలితో కలిసి జిల్లా కలెక్టర్ సంబందిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి నగర నివాసిత లబ్దిదారులకు కేటాయించిన ఐదు లే ఔట్ల లోని గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ప్రతి లే ఔట్ లో రోజుకు కనీసం 50 గృహాల స్టేజ్ కన్వర్షన్లు జరగాలని అన్నారు. వర్షాల కారణంగా నరేగా పనులు తగ్గనున్నందున కూలీలు అందుబాటులో ఉంటారాని వారిని సమన్వయంతో జగనన్న కాలనీలలో పనులకు ఉపయోగించాలని సూచించారు. రోజుకు ప్రతి లే ఔట్ లలో కనీసం 20 వేల నుండి 30 వేల వరకు ఇటుకలను అందుబాటులో ఉంచేందుకు ప్రతి లే ఔట్ కు ప్రత్యేక అధికారిని నియమించాలని సూచించారు. ఇంటి పట్టాలు అందుకున్న లబ్దిదారుల జియో టాగింగ్ పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని సూచించారు. అలాగే ఇప్పటికే కేటాయించిన పట్టాలో ఇళ్ళు నిర్మాణానికి వీలు పడని ప్రదేశం ఉంటే మార్పు కూడా చేయాల్సి ఉంటుందని సూచించారు. ఈ సమీక్షలో ఆర్.డి.ఓ. లు తిరుపతి, శ్రీకాళహస్తి కనకనరసా రెడ్డి , రామారావు, హౌసింగ్ పి.డి. చంద్రశేఖర్ బాబు, నగరపాలక డిప్యూటీ కమీషనర్ చంద్ర మౌళీశ్వర రెడ్డి, లే ఔట్ ఇంచార్జిలు, ఈ .ఈ.లు, డి.ఈ. లు పాల్గొన్నారు.

తిరుపతి అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తునే ఉంటాం

- ఎమ్మెల్యే భూమన
కౌన్సిల్ తోడ్పాటుతో అభివృద్ధికి పాటుపడుతున్నాం: మేయర్
కౌన్సిల్ తీర్మానాలు సత్వరమే పూర్తి చేస్తాం: కమిషనర్

విశాలాంధ్ర- తిరుపతి : తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ సాధారణ కౌన్సిల్ సమావేశం మంగళవారం మేయర్ డాక్టర్ శిరీషా అధ్యక్షతన, కౌన్సిల్ ప్రత్యేక ఆహ్వానితులుగా తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి పాల్గొనగా, కమిషనర్ అనుపమ అంజలి అజెండాను ప్రవేశపెట్టగా, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్రనారాయణ, కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు కౌన్సిల్ అజెండాలోని అంశాలుపై చర్చించి ఆమోదించడం జరిగింది. సమావేశానికి ముందు ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా అమరజీవి పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పించడం జరిగింది. కౌన్సిల్ ప్రత్యేక ఆహ్వానితులు, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి మాట్లాడుతూ తిరుపతి అభివృద్ధికి అందరి సహకారంతో ముందుకు వెల్లడం జరుగుతున్నదన్నారు. తిరుపతి కార్పొరేషన్ కౌన్సిల్ సభ్యులు ముందుచూపుతో ప్రజాభివృద్ధికి మాస్టర్ ప్లాన్ రోడ్లను పూర్తి చేసేందుకు పూనుకోవడం అభినందనీయమన్నారు. కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, అదనపు కమిషనర్ సునీత, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర్ రెడ్డి, సెక్రటరి రాధిక, రెవెన్యూ అధికారులు లోకేష్ వర్మ, సేతుమాధవ్, మునిసిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణ, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

న్యాయ సమీక్షకు విద్యుత్ పంపిణీ వ్యవస్థ బలోపేతం



విశాలాంధ్ర - తిరుపతి : ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఎస్ పిడిసిఎల్) పరిధిలోని చిత్తూరు, నెల్లూరు, కడప, కర్నూలు, అనంతపురం జిల్లాల పరిధిలో వ్యవసాయ విద్యుత్తు ఫీడర్లను వేరు చేయడం ద్వారా విద్యుత్ సరఫరా నష్టాల తగ్గింపు, విద్యుత్ పంపిణీ వ్యవస్థను బలోపేతం చేయడానికి సంబంధించిన పనులకు టెండర్లను పిలవడానికి ముందుగా సంబంధిత డాక్యుమెంట్లను న్యాయ సమీక్షకు పంపినట్లు ఆ సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కె. సంతోష రావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యుత్ పంపిణీ పునర్వ్యవస్థీకరణ పథకం (ఆర్ డిఎస్ఎస్) లో భాగంగా సంస్థ పరిధిలో గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్తు వ్యవస్థను మెరుగుపరచడం, వ్యవసాయ విద్యుత్తు సర్వీసులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్తు సరఫరా చేసేందుకు అవసరమైన మౌళిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలకు నిరంతర త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా కోసం ప్రత్యేక ఫీడర్ల ఏర్పాటు, అధిక లోడ్ కలిగి వున్న 33కెవి ఫీడర్ల విభజన పనులకు టెండర్లను ఆహ్వానించడం జరుగుతోందన్నారు. వీటికి సంబంధించిన పనుల్లో పారదర్శకత కోసం వినియోగదారుల నుంచి సూచనలు, సలహాలు, అభ్యంతరాలను స్వీకరించేందుకు వీలుగా ఈ డాక్యుమెంట్లను న్యాయ సమీక్షకు పంపినట్లు తెలియజేశారు. ఈ డాక్యుమెంట్లను జ్యుడిషియల్ కమిషన్ అధికారిక వెబ్ సైట్ లో పొందుపరిచినట్లు తెలిపారు. ఈ అంశంపై ప్రజలు, వినియోగదారులు తమ సలహాలు, సూచనలు, అభ్యంతరాలను నవంబరు 9వతేదీలోగా జ్యుడిషియల్ కమిషన్ ఈ-మెయిల్ ఐడి నకు పంపించవచ్చని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ఆకలి కేకలు వినిపించకూడదు

- జిల్లా ఇన్చార్జ్ డిసిహెచ్ఎస్ బనావత్ చిన్నకోపి నాయక్

విశాలాంధ్ర- సత్యవేడు: సత్యవేడు ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలలో చికిత్స పొందుతున్న రోగులనుంచి ఆకలికేకలు వినిపించకూడదని జిల్లా ఇంచార్జ్ డి సిహెచ్ఎస్ బనావత్ చిన్నకోపి నాయక్ ఆదేశించారు.మంగళవారం ఆయన స్థానిక ప్రభుత్వ కమ్యూనిటీ వైద్యశాలను సందర్శిం చారు.ఈ సందర్భంగా డిసిహెచ్ఎస్ బీసీకే నాయక్ మాట్లాడుతూ స్థానిక ఆస్పత్రి సలహా సంఘం కమిటీ సభ్యులను సంప్రదించి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు భోజనం వసతి కల్పించాలన్నారు.ఇందుగాను ప్రభుత్వం ప్రస్తుతం ఒక్కొక్క రోగికి చెల్లిస్తున్న 40 రూపా యలు త్వరలోనే పెరిగే అవకాశం ఉందన్నారు.దీనిపై ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం తీసుకొని అవకాశాలు ఉందన్నారు. అలాగే ఆసుపత్రిలో భర్తీ కాకుండా ఉన్న గైనకాలజిస్ట్,సర్జరీ పోస్టుల భర్తీకి చర్యలు చేపడతామన్నారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ విద్యాసాగర్,డాక్టర్ సురేష్,చంద్రన్,కంటి వైద్య నిపుణులు రమాప్రియ,డెంటల్ వైద్యులు ప్రతిభా చౌదరి,ఫిజియోథెరపిస్టు సురేఖ, ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి సలహా సంఘం సభ్యులు గోవిందస్వామి,చిన్నబ్బ, మునికృష్ణయ్య, పలువురు నర్సులు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కి పూలమాలవేసి నివాళులు

విశాలాంధ్ర - ఏర్పేడు : మండల కేంద్రంలో దళిత నాయకులు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కి పూలమాలవేసి నివాళులర్పించడం జరిగింది. గత వారం నుండి శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే కుమారుడు సుధీర్ రెడ్డి చేస్తున్న శవ రాజకీయాల చేస్తూ శ్రీకాళహస్తి శాసనసభలు బియ్యపు మధుసూదన్ రెడ్డి మీద, దళిత యువకుడు మీద ఆరోపణను వెతిరేకిస్తూ ఏర్పేడు పోలీస్ స్టేషన్లో ఎస్ఐకి సుధీర్ రెడ్డి మీద కంప్లీట్ చేయడం జరిగింది. వెంటనే ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సుధీర్ రెడ్డి సొంత రాజకీయాల కోసం ఒక దళిత యువకుడిని అనేక విధాలుగా అవమానించడం జరిగింది కాబట్టి వెంటనే ఆయన అరెస్ట్ చేయాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. వెంటనే శవాన్ని ఎక్కడ నుండి తెచ్చాడు సుధీర్ రెడ్డి అని విచారణ జరిపించి ఆ ఫ్యామిలీకి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున దళిత నాయకులు పాల్గొనడం జరిగింది.

తిరుమలలో వేడుకగా శ్రీవారి పుష్పయాగం

విశాలాంధ్ర - తిరుమల : కార్తీకమాసం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయంలో మంగళవారం పుష్పయాగ మహోత్సవం వైభవంగా జరిగింది. సువాసనలు వెదజల్లే 14 రకాల పుష్పాలు, 6 రకాల పత్రాలతో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారికి వేడుకగా పుష్పార్చన నిర్వహించారు. రంగురంగుల పుష్పాలు, పత్రాల మధ్య స్వామి, అమ్మవార్ల వైభవం మరింత ఇనుమడించింది.శ్రీవారి ఆలయంలోని సంపంగి ప్రాకారంలో గల కల్యాణమండపంలో ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామివారికి స్నపన తిరుమంజనం వేడుకగా జరిగింది. ఇందులో భాగంగా పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేపట్టారు. మధ్యాహ్నం 1 గంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు పుష్పయాగ మహోత్సవం కన్నుల పండుగగా జరిగింది. స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను పట్టు వస్త్రాభరణాలతో అలంకరించి వేదమంత్రాల నడుమ పుష్పకైంకర్యం చేశారు. చామంతి, సంపంగి, నూరు వరహాలు, రోజా, గన్నేరు, మల్లె, మొల్లలు, కనకాంబరం, తామర, కలువ, మొగలి రేకులు, మానసంపంగి పుష్పాలు, తులసి, మరువం, దవణం, బిల్వం, పన్నీరు, కదిరిపచ్చ పత్రాలతో స్వామి, అమ్మవార్లను అర్చించారు. ఈ సందర్భంగా వేదపండితులు రుగ్వేదం, శుక్లయజుర్వేదం, కృష్ణ యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదాలను పఠించారు. పుష్పాలకు అధిపతి అయిన దేవుడు పుల్లుడిని ఆవాహన చేసి 20 సార్లు వివిధ రకాల పుష్పాలతో అర్చించారు. ఉత్సవమూర్తుల నిలువెత్తు వరకు ఉండేలా పుష్ప నివేదన చేపట్టారు.అంతకుముందు ఉదయం ఉద్యానవన విభాగం కార్యాలయం నుండి శ్రీవారి ఆలయం వరకు పుష్పాల ఊరేగింపు వైభవంగా జరిగింది. పుష్పాల దాతలు, శ్రీవారి సేవకులు గోవిందనామస్మరణతో ఈ ఊరేగింపులో పాల్గొన్నారు.

ఎన్.ఎల్.ఈ.పి. సర్వే 15 నుండి డిసెంబర్ 5 వరకు : కలెక్టర్

విశాలాంధ్ర - తిరుపతి : జాతీయ కుష్టు నివారణ ఇంటింటి సర్వే కార్యక్రమం ఈనెల 15 నుండి డిసెంబర్ 5 వరకు జిల్లాలో పగడ్బందీగా నిర్వహించాలని ఎన్.ఎల్.ఈ.పి. జిల్లా కోఆర్డినేషన్ కమిటి చైర్మన్ మరియు జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణా రెడ్డి ఆదేశించారు. సోమవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ లో ఎన్.ఎల్.ఈ.పి. జిల్లా కోఆర్డినేషన్ కమిటి సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్.ఎల్.ఈ.పి. కార్యక్రమం కోవిడ్ కారణంగా గత రెండు సంవత్సరాలు ఆగిన విషయం తెలిసిందేనని కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఈ నెల 15 నుండి డిసెంబర్ 5 వరకు సచివాలయ వాలంటీర్ల సహకారంతో ఆశాలు, అంగన్వాడీలు, ఏ.ఎన్.ఎం లు, డాక్టర్లు, పగడ్బందీగా ప్రతి ఇంటి సర్వే ప్రణాళిక బద్ధంగా చేపట్టాలని సూచించారు. పాఠశాలలలో, ప్రభుత్వ వసతి గృహాలలో సర్వే చేపట్టాలని సూచించారు. శరీరంపై స్పర్శ లేని మచ్చలు, రాగి రంగు మచ్చలు, పొడలు, నరాల ఉబ్బు, కాళ్లు, చేతుల కండరాల బలహీనత, తిమ్మిర్లు, కళ్ళు పూర్తిగా మూసుకోలేక పోవడం, చెవి తమ్మెలు మందంగా మారడం , బుడిపెలు వంటివి ఉండటం, వ్యాధి లక్షణాలు కావచ్చని గుర్తించి వైద్యపరీక్షలు జరిపి వారంలోపు ఉన్నట్లయితే చికిత్స ప్రారంభించాలని ఈ వ్యాధి మైకో బ్యాక్టీరియం లేప్రే అను బ్యాక్టీరియ వలన కుష్టు వ్యాప్తి కి కారణమనే విషయం ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ అవగా హన కార్యక్రమాన్ని, సర్వే ను డి.ఎల్.డి.ఓ, ఐ.సి.డి.ఎస్, మెడికల్, శాఖలు సంయుక్తంగా సూక్ష్మ స్థాయి నుండి నిర్వహించాలని అన్నారు. ఈ సమావేశంలో కమిటి కన్వీనర్ మరియు జిల్లా లెప్రసి, ఎయిడ్స్, టి.బి అధికారిణి అరుణ సులోచన దేవి, డి.ఎల్.డి.ఓ సుశీల దేవి, జిల్లా ఎస్.సి వెల్ఫేర్ అధికారి చెన్నయ్య, డి.ఐ.ఓ శాంతకుమారి, ఐ.సి.డి.ఎస్ సూపరిం టెండెంట్ రోహిణి, ఎపిడమాలజిస్ట్ కిరణ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

అమరజీవికి పుష్పాంజలి

విశాలాంధ్ర - బుచ్చినాయుడు కండ్రిగ : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ అవతరణ యోధులు పొట్టి శ్రీరాములు అవతరణ దినోత్సవం నిర్వహించారు ప్రభుత్వ పాఠశాలలోని ఆయా ప్రధానోపాధ్యాయులు పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రను గూర్చి క్లుప్తంగా విద్యార్థులకు వివరించారు,దేశంలో మొట్ట మొదట భాషా ప్రయుక్త రాష్ట్రంగా ఏర్పడిన రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నారు, పక్కన తమిళనాడు రాష్ట్రంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో కొన్ని ప్రాంతాలు అందులో మిళితమై ఉండగా తమిళ భాష నుండి తెలుగువారిని కోసం తెలుగు రాష్ట్రం ఏర్పాటు చేయుటకు, పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం మరువలేనిదని కొనియాడారు, ఆయన 58 రోజులు అకంటిత దీక్ష అనంతరం ప్రాణాలు విడిచారు అన్నారు ఆయన మృతితో అప్పటి ప్రధాని శ్రీ జవహర్ లాల్ నెహ్రూ ఆంధ్ర రాష్ట్ర ప్రకటన 1956 నవంబర్ 1వ తేదీన ఆంధ్ర ప్రదేశ్ గా అవతరించిందన్నారు,ఆయన పుణ్యమా అంటూఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం జరుపకుంటున్నాం, పాఠశాలలో శ్రీ అమరజీవి పొట్టి శ్రీరాములు వారి చిత్రపటానికి విద్యార్థులతో పుష్పాంజలి ఘటించారు. కల్లివెట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే.రమణయ్య, యువ శ్రీ మురళి, కంచన పుత్తూరు ప్రాథమికోన్నత పాఠశాల, పలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నిర్వహించారు. రై టప్: బి ఎన్ కండ్రిగ మండలం కంచన పుత్తూరు ప్రాథమికోన్నత పాఠశాలలో పొట్టి శ్రీరాములు కి పుష్పాంజలి ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం



విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవంను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని తెలుగు గంగా కాలనీ నందుగల ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి. రాజశేఖర్ అధ్యక్షతన, రాజనీతి శాస్త్ర విభాగాధ్యాపకులు కె.సుజాత ఆధ్వర్యంలో జరిగిన ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలలో ప్రిన్సిపాల్ బి.రాజశేఖర్ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం గురించి విద్యార్థులకు తెలియజేశారు. నవంబర్ 01, 1956న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందని, భాషా ప్రయుక్త రాష్ట్రంగా తెలుగు రాష్ట్రం ఏర్పడిందని విద్యార్థులకు వివరించారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం ప్రాముఖ్యతను, పొట్టి శ్రీరాములు చేసిన త్యాగాలను గురించి విద్యార్థులకు ప్రిన్సిపాల్ తెలియపరిచారు. విద్యార్థులు ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీకాంత్ రెడ్డి, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.